# కారణభూతుడు

కళ్ళుండటమెందుకు - కాంచడానికి! కానైతే చీకటిలో కళ్ళు కనిపించవు. అందుకు విరుద్ధంగా విపరీతమైన మహోజ్వల కాంతిలో సైతం కళ్ళు కనిపించక పోవడం సంభవమేనని విజ్ఞులు చెబుతారు.

అలాగే బ్రహ్మాండ భాండం పగిలిపోయేటంతగా ఒక మహారావం ఉప్పతిల్లినప్పుడు చెవులకు గూడా బధిరత్వం వాటిల్లవచ్చు.

అంటే ఏమన్నమాట! అటు దృశ్యప్రపంచమూ, ఇటు శబ్ద ప్రపంచమూ వాటి వాటి భిన్న ధ్రువాల్లో మానవుని ఇంద్రియ జ్ఞానాన్ని పరిహసిస్తూనే వున్నాయన్నమాట!

కనిపించడానికి కనిపించకపోవడానికీ మధ్య నున్న సర్వ దృశ్యాలకూ వెనుక, వినిపించడానికీ వినిపించకపోవడానికీ మధ్య నున్న సర్వ శబ్దాలకూ వెనుక ఈ మహా విశ్వంలో నిరంతర గంటా నినాదంలా ధ్వనిస్తున్న ప్రశ్న ఒక్కటే ఒక్కటి.

ప్రశ్న ఒక్కటే అయినా దానికి మానవుడుకైసేసిన బురఖాలు పెక్కులు.

ఎవ్వనిచే జనించును?

జగమెవ్వనిలోపల నుండును?

ఎవ్వనిచేత డిందును?

పరమేశ్వరు డెవ్వడు?

మూలకారణుం డెవ్వడు?

ముక్తసరిగా చెప్పాలంటే ఎవ్వడు, ఎవ్వడు, ఎవ్వడు అన్న ప్రశ్నే అది!

ఈ 'ఎవ్వడు' అన్న ప్రశ్నకు జవాబుగా అమరివున్న సర్వాంతర్యామి ఎవడైతే వున్నాడో- వాడిలాగే ఈ ప్రశ్న గూడా సర్వాంతర్యామి.

అది తనలో జిజ్ఞాస ప్రారంభమైన ఆదికాలం నుంచీ మానవుణ్ణి వెంబడిస్తున్న ప్రశ్న.

ఇందుగలడందు లేదన్న సందేహానికి వీల్లేకుండా ఈ విశాల ప్రపంచంలో ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు ఏదో ఒక రూపంలో వినవచ్చే ప్రశ్న గూడా అదే!

ఫలానా దేశానికి కాబోయే ప్రెసిడెంటెవ్వడు? రానున్న సంవత్సరం నోబుల్ ప్రయిజు పొందనున్న దెవడు?

ఒలంపిక్ పోటీలో గెలువబోయే దెవ్వడు?

దీపావళి రచనల పోటీలో నెగ్గబోయే దెవ్వడు?

చదువుతున్నది సాంఘిక నవలైతే శారదకు, సుశీలకు కాదా రాధకు (అంటే కథానాయకకి) దొరకనున్న భర్త ఎవ్వడు?

చేతుల్లో వున్నది డిటెక్టివ్ నవలైతే హంతకుడెవ్వడు? అంతేగాదు -

కూతుళ్లున్న తల్లిదండ్రులకైతే అల్లుణ్ణి గురించి, ఇంట అవసరాలుండి చేత అర్థంలేని వాళ్లకు అప్పిచ్చి ఆదుకోగల ఉదారుణ్ణి గురించి, జిజ్ఞాసువైన వాడిక తన సందేహాలను పోకార్చగల గురువును గురించి 'ఎవ్వడు' అన్న ఈ ప్రశ్న ఎదురు కావడం గూడా సహజమే!

కానైతే ఇక్కడ చెప్పబోతున్న కథ, చెప్పబోతున్న విధంగా పరిణమించడానికి హేతుభూతులైన కామవరం రామన్నగానీ, చీనేపల్లి సీనప్పగానీ రాజకీయ విమర్శకులు గారు. వేదాంతులు కారు. సాహిత్యం పట్ల వాళ్ళకున్న అభిమానం గూడా కొద్దిపాటిది. ఇక క్రీడలకూ వాళ్ళకూ చాలా దూరం. ఒక్కమాటలో చెప్పాలంటే పువ్వుల్లో నిత్యమల్లెల్లాగా. ఆహారాల్లో అచ్చమైన సాత్వికాహారం లాగా వాళ్ళు మామూలు సాదారకం ఆవరేజీ తెలివితేటల మనుషులు. ఎవడు – అన్న ఈ ప్రశ్న తాకిడికి వీళ్ళు లోనుగావడం గూడా అత్యంత వినూత్న విచిత్ర విషమ పరిస్థితుల్లోనే సంఘటిల్లింది.

ఆ పరిస్థితులేవో వివరించడానికి ముందుగా 'కర్త'ను అన్వేషించడానికి పూనుకున్న 'కర్మ'ల వంటి రామన్నా, సీనప్పల్ని గురించి ఒకటి రెండు మాటలు చెప్పుకోవడం సమంజసం.

వాళ్ళిద్దరూ ఒకటే పట్టణంలో వేర్వేరు పేటల్లో పుట్టి పెరిగారు. పేటకొక బడి ఉండడం వల్ల వేర్వేరు ప్రాథమిక పాఠశాలల్లోనే చదివారు. ఆనాటికా పట్టణంలో ఉన్న దొకటే హైస్కూలు. హైస్కూల్లో చేరిన కొద్ది రోజులకే రామన్నకు సీనప్పకు స్నేహం కలిసింది. ఆ స్నేహం దినదిన ప్రవర్ధమానం అవుతూ వచ్చింది. ఆనాటికింకా ఆ పట్టణంలో కాలేజీ ఏర్పడలేదు. అందువల్ల మిత్రద్వయం పై చదువుల కోసం నగరానికి వెళ్ళవలసి వచ్చింది. నగరంలోనైనా వాళ్ళ కాలేజీ జీవితం ఎలా గడచింది? రామన్న లేని సీనప్పను గానీ, సీనప్పలేని రామన్ననుగానీ కాలేజీ చూచి ఎరుగదు. సృష్టిలో తీయనిది స్నేహమే అయితే, అలాంటి స్నేహబంధానికి ఉదాహరణంగా పురాణకాలం నుంచీ నరనారాయణులను, కర్ణదుర్యోధనులను పేర్కొనడం కద్దు! ప్రస్తుత కథాంశంలో అలాంటి పోలిక తీసుకురావడం ఉత్ప్రేక్షగా తోచవచ్చునేమో! అయితే పోలిక జోలే మనకొద్దు. సహజోక్తిగానే చెప్పుకోవాలంటే వాళ్ళల్లో ఒకరు రామన్న అనీ, వేరొకరు సీనప్ప అనీ లోకానికి బాగా తెలుసు! కానీ ఎవడు రామన్నో, ఎవడు సీనప్పో చాలామందికి తెలియదు.

పెరటిలో పెంచిన పూలతోటలకు మల్లే ముచ్చటైన చిన్న బ్రతుకులు వాళ్ళవి. నానావర్ణ సుమశోభితమై, కమ్మని వాసన వెదజల్లుతూ, నడుమనున్న గోడనుకూడా దాటి అల్లిబిల్లిగా అల్లుకున్న స్నేహలత ఒక్కటే ఆ రెండు పూలతోటల్లోనూ కళ్ళకు కొట్టవచ్చినట్లుగా కనిపించేది. అంతకుమించి కథగా మలుచుకోడానికి ఉపకరించే ప్రత్యేకాంశమేదీ వాళ్ళ జీవితాల్లో కానరాదు. ఇద్దరివీ సంపన్న కుటుంబాలు, తల్లిదండ్రులతో, అన్నదమ్ముళ్ళతో, అక్కచెల్లెళ్ళతో, బంధువుల ఆగమనంతో, మిత్రులకిచ్చే ఆతిథ్యాలతో, నదీతీరాన కొబ్బరి తోపుల్లా, కీనేరుబావి గట్టున అరటితోటల్లా కలకలలాడే కుటుంబాలు. రామన్న తండ్రి భీమన్న. సీనప్ప తండ్రి రామప్ప నూనె వ్యాపారంలో భాగస్వాములు. కచ్చితమైన నిజాయితీ అప్పటమైన వేరుశెనగ నూనె లాంటిది. కల్తీనెయ్యి కంటే అప్పటమైన వేరుశనగ నూనె ప్రశస్తమని లోకులకు తెలుసు. అదే వ్యాపారంలో వాళ్ళ ఘనవిజయాలకు వెనుకనున్న బహిరంగ రహస్యం.

పట్టపరీక్షలిక నెలరోజుల్లో ఉన్నాయనగా నాలుగైదు రోజుల తేడాతో మిత్రులిద్దరికీ స్వస్థలం నుంచి రెండు ఉత్తరాలు వచ్చాయి. తారీఖులు వేరు. వ్రాసిన వ్యక్తులు వేరు. కానీ విషయమొక్కటే! ఒకటి, ఇక చదివింది చాలట. రెండు, అక్కడ ఇంటిల్లిపాదికీ ఎవరి పనులు వారికి సరిపోతున్నాయట. మూడు, ఇటీవల నూనె వ్యాపారంలో పొత్తు బేరానికి స్వస్తిచెప్పి ఎవరికి వారుగా విడిపోవడంతో కార్యభారం పెరిగిందట! సారాంశం:

కనుక పరీక్షలు కాగానే ఇంటికి వచ్చి నూనె మండీలో పనిచూచుకుంటే తమకెంతో సౌకర్యంగా ఉంటుందట!

తండ్రులు తనూజులకు వ్రాసిన ఉత్తరాలు. రామన్న సీనప్ప ముఖంలోకి చూచాడు. సీనప్ప రామన్న ముఖంలోకి చూచాడు. ఇద్దరి ముఖాలూ వివర్ణమై పోయాయి. వ్యాపారంలో విడిపోవడమా! సఖ్యతకు గూడా స్వస్తివాచకం కదు కదా! ఎందుకు జరిగిందిది? ఎలా జరిగిందిది?

ఏదో జరగరానిదే జరిగివుంటుందని మిత్రులిద్దరూ అమంగళాన్నే శంకించారు.

కానీ ఎంతగా ఆలోచించినా ఆ అమంగళం తాలూకు స్వరూప స్వభావాదులు మాత్రం ఊహకందడం లేదు. రామదుర్గంలో పేరుకు ప్రతిష్ఠకు తావలాలైన కుటుంబాల మధ్య నెలకొన్న మైత్రి ఈనాటిది గాదు. ఆ మైత్రికి అనుబంధంగా పెరిగి పెద్దదవుతూ వచ్చిన ఉమ్మడి వ్యాపారం ఈనాటికిలా బెడిసిపోయిందంటే అందుకు కారణం సుమారుపాటిదై వుండదు.

"తినబోతూ రుచులడగడ మెందుకురా రామం! ఇంక నెలరోజుల్లో మనం ఎలాగూ సాక్షాత్తుగా కథారంగంలోనే అడుగుపెట్టబోతున్నాం! అప్పుడిక పరిస్థితులు వాటంతటవే తెలిసొస్తాయి...?" అన్నాడు సీనప్ప.

కానీ అంతవరకు వేచివుండవలసిన అవసరం లేకపోయింది. ఓ రోజు సాయంకాలం హాస్టలు ప్రాంగణంలో శేషాచలపతిగారు తారసిల్లారు. పతిగారు రామదుర్గం జిల్లాలో డిప్యూటీ కలెక్టరుగా పనిచేసి పింఛనీ పుచ్చుకున్నారు. ఉద్యోగానంతరం అక్కడే స్థిరపడ్డారు. పప్పులేని పెళ్ళి ఎలాగైతే లేదో, అలాగే రామదుర్గంలో పతిగారు లేని సభలు గానీ, సమావేశాలు గానీ ఉండవు. సాధారణంగా వయో వృద్ధులకూ కాలంతోబాటుగా వస్తున్న క్రొత్త పరిణామాలు రుచించవు. పురాతనమైన కట్టుబాటు ఒకటి సడలిపోతున్నదని తెలిస్తే వాళ్ళకు చెప్పరానంత చిరాకు కలగడం సహజమే! పతిగారితో ఆ చిక్కులేదు. తమకు నచ్చనివన్నీ జరగనేజరగ గూడదన్న పిడివాదం ఆయనలో కనిపించదు.

మీదు మిక్కిలి పతిగారు అటు కామవరంవారికి, ఇటు చీనేపల్లివారికిగూడా కావలసినవారు.

పతిగారి అమ్మాయి స్త్రీల కళాశాలలో చదువుకుంటోంది. ఆయనగారి మేనల్లుడొకడు రామన్నకు సీనప్పకు సహాధ్యాయి. వాళ్లను పరామర్శించి వెళ్ళే నిమిత్తం పతిగారు అప్పుడప్పుడూ ఇలా నగరానికి వచ్చిపోతుంటారు.

"ఓహో, అపూర్వ స్నేహితులా, చాలా సంతోషం! మిమ్మల్నొకసారి కలుసుకోవాలనే అనుకున్నాను. ఏదీ, ఎక్కడ మీరూము?"

పతిగారు గదిలోపలికి వచ్చారు. కుర్చీలో కూర్చున్నారు. కాసేపు గోడలపైన ఫోటోలవైపు, అలమారలోని పుస్తకాలవైపు చూశారు. తటాలున మిత్రులకేసి తిరిగారు.

"రామన్న అండ్ సీనప్ప! అవేగదూ మీ పేర్లు? కానీ మిమ్మల్ని రామప్ప అండ్ సీనన్న అని ఎందుకు పిలవకూడదో నాకర్థం గాదు..." అన్నారు.

"ఎందుకు పిలవకూడదు? అసలు ఈ 'అన్న' 'అప్ప' అన్న టోపీలు ఉండకపోవడమే మాకిష్టం. మీరు నన్నేమో 'రామం' అనండి. మరి వీడేమో సీను...."

"మరైతే రామం అండ్ సీనూ! మీరు బొత్తిగా ఎలిమెంటరీ స్కూలు కుర్రాళ్ళకు మల్లే కూర్చోమనేదాకా కూర్చోరన్నమాట! అయితే ఏదీ కానివ్వండి చూద్దాం! సిడౌన్..."

మిత్రులిద్దరూ నవ్వుకుంటూ పెద్ద ట్రంకుపైన ప్రక్క ప్రక్కగా కూర్చున్నారు.

"మీరిద్దరూ ఇలా చేరువగా ఉండడం చూస్తుంటే కన్నుల పండువగా ఉంది. కానీ మీరైనా ఎంతకాలమని ఇలా ఉండగలరన్నదే నా సందేహం..."

అరేబియన్ నైట్స్ కథలో జాలరివాడి కొకడికి సముద్రగర్భంలో ఒక డబ్బా దొరుకుతుంది. మూత తీసేసరికి అందులోనుంచి పెల్లుబికిన పొగ వియన్మండలం దాకా వ్యాపిస్తుంది. అది క్రమక్రమంగా చిక్కనై పోతూ వచ్చి చివరికొక రాక్షసాకృతిగా పరిణమిస్తుంది. వినబోతున్న దుర్వార్తే ఆ రాక్షసాకృతి. ఇప్పుడు పొగమబ్బులలాంటి సందేహాలు మిత్రుల చుట్టూ క్రమ్ముకుంటున్నాయి.

"మీరు కాస్త వివరంగా చెప్పాలి. నాలుగైదేళ్ళుగా ఊరి గొడవలేవీ మాకు స్పష్టంగా తెలియవు. మీరైతే కచ్చితంగా వాస్తవాన్నే చెప్పగలరు..." ప్రాధేయపడ్డాడు సీనప్ప.

"నాకు చెప్పాలనే ఉంది..." పొగచుట్ట ముట్టించుకుని నింపాదిగా ప్రారంభించారు, శేషాచలపతిగారు. "అబ్బాయిలూ! మీరు శ్రద్ధగా వినాలి. ఎందుకంటే ఇవి పెద్దవారికి పాఠాలు చెప్పదగిన రోజులుగావు. చెప్పినా వాళ్ళు వినిపించుకునే స్థితిలో లేరు. సమాజం ఒక నూలు ఉండలాంటి దనుకుంటే, తెలిసో తెలియకో ఎక్కడో ఒకచోట జరిగిన తప్పిదం వల్ల ఆ ఉండలో ముడిపడుతోంది. ఆ ముడిని విప్పే ప్రయత్నం జరగడంలేదు సరిగదా, దానికి తోడుగా అట్టి ముళ్ళు మరికొన్ని పడుతున్నాయి. ఇదంతా చిక్కుల్ని చిక్కులతో గుణించే గుణకారం లెక్కలా పరిణమించింది. చివరకు! అదిగో, అప్పుడే చిరాకు కలుగుతున్నట్టుంది మీకు..."

"పరవాలేదు, చెప్పండి" అన్నాడు రామన్న.

"అందుకే సూటిగా అసలు విషయంలోకి వస్తున్నాను. సంఘజీవనం ఒక నదీప్రవాహంలాంటిదైతే, పొంగిపొరలి ఉపద్రవకారి గాకుండా మన జిల్లాలో దాన్ని హద్దుల్లో నియమించిన శక్తులు రెండు. నదీజన్మస్థానంలో రెండు గట్లూ ఒక్కటే కావడానికి వీలున్నట్టుగా ఆ రెండు శక్తులూ ఆదిలో ఏకగర్భ సంజాతాలని కూడా ప్రతీతి ఉంది. అందుకు తగ్గట్టుగా ఆకారంలో నైతేనేమీ, గుణగణాల్లో నైతేనేమీ, ఆచార వ్యవహారాల్లో నైతేనేమీ, అన్నలకూ అప్పలకూ చాలా పోలికలున్నాయి. మత విద్వేషాల వల్ల జరిగిన మారణహోమాలు, ఒకే మతంలో నుంచీ పుట్టుకొచ్చిన ఉపమతాల పరస్పర సంఘర్షణ వల్ల చెలరేగిన కల్లోలాలు చరిత్రకు తెలిసినవే! ఆనాటి మాట ఏమోగానీ, ఇటీవల కొన్ని శతాబ్దాలుగా రామదుర్గం జిల్లాలో మత విభేదాల వల్ల, కులవిభేదాల వల్ల అలాంటి చెచ్చెరువులు రగులుకున్నాయని చెప్పడానికి ఆధారాలు కనిపించవు. మీదు మిక్కిలి ఒకటి రెండు తరాలకు మునుపు కులవివక్షత పట్ల స్పష్టమైన ఈసడింపు ప్రకటితమౌతుండేది కూడా! "ఏ కులమని నను వివరమడిగితే ఏమని తెలుపుదు లోకులకు – లోకులకు పలుకాకులకు" అని వీరబ్రహ్మంగారు వెచ్చగా ఓ చురక అంటించిన తర్వాత కులంపేరుతో పెద్ద పీట కావాలని ఆశించే వెర్రివెంగళప్ప లెవరూ లేకపోయారు. అంటే జనంలో అహమహమిక అన్న నైసర్గిక లక్షణం బొత్తిగా నశించిపోయిందని అర్థం చెప్పుకోగూడదు. ఎటొచ్చీ అది ఆనాడు లోకకల్యాణానికి మాత్రమే ఉపకరించిన మాట నిజం! ఒకానొక రాజన్న పరదేశుల కోసం సత్రం కట్టిస్తే, ఒక రంగప్ప మంచినీటికోసం నూయి త్రవ్వించేవాడు. ఒక సీతప్ప దేవుడికోసం గుడి కట్టిస్తే, ఒక శాయన్న పిల్లలకోసం బడి కట్టించేవాడు. పరోపకార పారీణతలో, వదాన్యతలో, త్యాగశీలంలో ఆనాడు అప్పలకు,

అన్నలకు మధ్య నెలకొన్న పోటీకి ఫలితంగా రామదుర్గం జిల్లాలో ఈనాడు వెయ్యి చెరువులున్నాయి. అంతకు పదింతల నూతులున్నాయి. వందలకొలది గుళ్ళు, గోపురాలు, బడులు, బాటలూ ఉన్నాయి.

శేషాచలపతిగారు ఉపన్యాసాలకు అలవాటుపడిన వ్యక్తి. అందుకు తగ్గట్టుగా ప్రస్తుత శ్రోతలిద్దరూ శ్రద్ధగా వినడానికి అలవాటుపడిన వాళ్ళే కావడం వక్తకు మరింత ఉత్సాహకారి కాగలిగింది. ఆయన కొనసాగించారు...

"అయినా ఈ వాపీకూప తటాకాదుల సాక్ష్యమెందుకు? అంతకంటే వెనక్కువెళ్ళి చరిత్ర గ్రంథాలను పరామర్శించడమెందుకు? ముప్పైయేళ్ళు నిండిన ప్రతి భారతీయుడికీ స్వాతంత్ర్యోద్యమ వీరగాథ సుపరిచితమే! మచ్చుకు కొన్ని మాత్రమే చెప్పదలచుకుంటే తడవుకోనవసరం లేకుండా చటుక్కున స్ఫురించే ఉదాహరణలు రెండు. విష్ణుదేవుడి వామనాకృతిలా జాతీయ చైతన్యం ఓ ముసలి తాత రూపంలో నిధికోసం వస్తే, ఓ కుటుంబం ఆఖరు ముక్కుపుడకతో సహా ఆయన జోలెలో పడవేసింది. గృహలక్ష్మిని, రాజ్యలక్ష్మిని త్యజించి సత్యాన్వేషణకై అడవులకు వెళ్లిన సిద్ధార్థుడిలా, ఓ పెళ్ళికొడుకు పెళ్ళి పీటలపైన్నుంచీ ఆమధు పర్కాలతో, ఆ పుష్పహారాలతో అలాగే జైలుకు వెళ్ళాడు. మొదటిది కామవరం వాళ్ళ కుటుంబం. రెండవది చీనేపల్లి వాళ్ళ ఉదంతం..."

ప్రసంగంలో పడి తనసంగతి మరచిపోయినందుకు కినుక వహించిన పొగచుట్టను మళ్ళీ వెలిగించుకున్నారు పతిగారు. నిండుగా ఒకసారి పొగపీల్చి గుప్పున బయటికి వదిలారు.

"మరైతే అలాంటి సుక్షేత్రంలో ఈనాడిలా కలుపుమొక్కలెందుకు పుట్టాయని గానీ, మరెందుకిలా ఏపుగా పెరిగి బలిసిపోతున్నాయని గానీ ఎవరైనా సూటిగా ప్రశ్నిస్తే ఏమని బదులు చెప్పాలో తోచదు. తన తంటా లేవో తానుపడి ఎవడో చరిత్రకారుడు తేల్చి చెప్పవలసిన కారణాలను గురించి నేను ఊహాగానాలు చేయడం కూడా లేదు. కానీ నా స్థూలబుద్ధికి తోచినంతలో, నేను చెప్పగలిగిన కారణాన్ని చెప్పమంటే, అందుకు సిద్ధంగా ఉన్నాను..."

"చెప్పండి, చెప్పండి" ఏకకంఠంతో అడిగారు మిత్రులు.

"జరిగిందిది, ఉన్నట్టుండి సంఖ్యాబలానికి ఎక్కడలేని ప్రాముఖ్యత సిద్ధించింది. ప్రతిగ్రామంలోనూ ఎన్ని గడపలు వాళ్ళవి, ఎన్ని గడపలు వీళ్ళవి అన్న జిజ్ఞాస ప్రారంభమైంది. ఆపైన తలకాయల లెక్క గూడా ముమ్మరంగా కొనసాగింది. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు. ఒక్కటైతే చాలు. పదవులు కత్తి ఒరలు. ఒక సమయంలో ఒక పదవిని ఒక వ్యక్తి మాత్రమే అధిష్టించగలగడం సాధ్యం. ఇద్దరు ముందుకొస్తే ఇక ఎన్నికే శరణ్యం. ఈ ఎన్నికకు చదువు, సంస్కారం, సత సద్వివేకం, సచ్ఛీలం లాంటి అర్హతలకన్నా బలపరిచే జనబలమే ముఖ్యమై పోయింది. జనాన్ని కూడగట్టుకోడానికి ఎన్నో మంత్రతంత్రాలు కావాలని వచ్చాయి. అన్నింటిలోనూ బ్రహ్మాస్త్రంలా ఉపకరించునది ఒక్కటే! అదేమిటో చెప్పగలిగితే మీరు నా మాటల్ని సావధానంగా వింటున్నట్టే లెక్క. క్లూ కూడా ఇస్తున్నాను. అది పంచాక్షరీ మంత్రం...."

టక్కమని పెల్లుబికింది సమాధానం – "చెప్పలేకేమండీ! కులాభిమానమే కదూ..."

"మట్టిలోనుండి ఖనిజాన్ని వేరుచేసినట్టుగా మనిషి రక్తంలోనుంచీ ప్రోది చేసిన ఈ అభిమానాన్ని ఒక బలమైన ఆయుధంలాగా వినియోగించడం జరిగింది. మొదట

గ్రామస్థాయిలోనే మాట్లాడుకుందాం. ఓ గ్రామంలో అయిదు వందల ఇల్లున్నాయి. దానికి పదవంటూ ఒకటి ఏర్పడింది. ఉన్న అయిదువందల ఇళ్ళల్లో మూడింట ఒకపాలు అన్నలవి. అంతకంటే కొంచెం ఎక్కువగా అప్పలవి. మిగిలిన కుటుంబాలు తదితరులవి. సమాజమన్న నూలుఉండలో మొదటిసారిగా పడిన ముడి అక్కడే పడింది. మళ్ళీ జనాభాను బట్టి చూస్తే అన్నల సంఖ్య హెచ్చు. అప్పల సంఖ్య తక్కువ. జనాభా లెక్కరీత్యా పదవి తమకే కావాలని అన్నలు, కుటుంబాల లెక్క దృష్ట్యా పదవి తమదేనని అప్పలు...

"అందులో మళ్ళీ ఒక కిటుకు. అన్నలుగానీ, అప్పలుగానీ తమంతట తాముగా ఆ పదవిని చేజిక్కించుకొనే పరిస్థితిలో లేరు. అందుకు వాళ్ళూ వీళ్ళూ గాకుండా గ్రామంలో మిగిలిఉన్న మూడోవర్గం ఏదైతే ఉందో దాని తోడ్పాటు అత్యవసరం.

"ఆ తదితరులు పాపం నోట నాలుకలేని మనుష్యులు. ఏ రాజు ఏ రాజ్యమేలినా తమకు పూటకు పట్టెడన్నం దొరికితే చాలుననుకొనే కుక్షిజీవులు. వాళ్లకు రాచరికాలు అక్కర్లేకపోయినా రాచరికాలకు వాళ్ళు కావలసి వచ్చారు. అటు అన్నల్లోకి, ఇటు అప్పల్లోకి కలగాపులగంగా విస్తరిల్లి ఉన్న తమ జీవితాన్ని ఓ వైపున సీదాగా ఖాళీచేసి, మరోవైపుకు సర్దుబాటు చేసుకోడం సులభమైన పనిగాదు. అన్నలు భూస్వాములు, అప్పలు ధనవంతులు. వాళ్ళు వడ్డీకిచ్చిన అప్పులు, వీళ్ళు కౌలుకిచ్చిన భూములు - ఇవే ఈ తదితరుల జీవనానికి పునాదులు. ఆ పునాదులు కదలిపోతే వీళ్ళ బ్రతుకేం కావాలి? అటు చూస్తే గోహత్య. ఇటు చూస్తే బ్రహ్మ హత్య. సరే, అటో ఇటో తేల్చుకోవలసిన సందర్భం రానే వచ్చింది. మాట వరుసకే ననుకొందాం - అన్నలే గెలిచారు. అప్పలు మండిపడ్డారు. అప్పులు అణాపైసలతో సహా చెల్లించేయమన్నారు. చెల్లించకపోతే ఏం చేస్తారో చూద్దాం లెమ్మని అన్నలు ఋణగ్రస్తులకు బాసట నిలిచారు. ఋణదాతలు కోర్టుకు దారితీశారు. అక్కడ కోర్టులో సివిల్ కేసులింకా జరుగుతుండగానే, ఇక్కడ క్రిమినల్ కేసులకు దోహదక్రియలు జరుగసాగాయి. పట్టపగ్గాలు లేకుండా పగలు రగులుకున్నాయి. కార్చిచ్చులాగా కావేషాలు అలముకున్నాయి.

"మానవ నాగరికతా పరిణామంలో శిలాయుగమే మొదటిదైతే, అప్పుడు ఆటవికుడైన మానవుడు తన కోరికలను, కార్పణ్యాలను ఎప్పటికప్పుడే చల్లార్చుకునే వాడు. ఇప్పుడలా కాదు. నాగరికత ముదిరినకొద్దీ ప్రతి చిన్న కార్యక్రమమూ, ఒక నానుడు వ్యవహారంగా పరిణమించింది. అందువల్ల చిన్న ఎత్తున కొట్లాటలు గానీ, పెద్ద ఎత్తున దొమ్మీలు గానీ ఎల్లకాలమూ జరిగేవీ గావు. మరైతే ఎల్లకాలమూ జరిగేవి మాటలు. పూర్వం ప్రతి పల్లెలోనూ, భజనకూటాలుండేవి. కొన్ని కొన్ని సందర్భాల్లో ఎడతెగకుండా కొన్ని గంటలపాటు భజన జరిగితే, మధ్యమధ్యలో కొందరు భక్తులు వెళ్ళిపోతుండగా, మరికొందరు వచ్చి వాళ్ళస్థానాన్ని ఆక్రమిస్తుండడం పరిపాటి. అలాంటి భజన కూటాలకు బదులుగా ఇప్పుడు పల్లెల్లో మాటల నెలవులు కొన్ని ఏర్పడ్డాయి. ఈ మాటల నెలవుల్ని మరొక విధంగా యజ్ఞశాలలతో గూడా ఉపమించవచ్చు. ఎదుటివారిపట్ల తమకుగల విద్వేషమే ఈ యజ్ఞానికి ఆదిదేవత. స్వార్థమే హోమగుండం. మాటలే సమిధలు. ఈసడింపే అగ్ని. తృణీకారమే ఆజ్యం!"

శేషాచలపతిగారు గడియారం వైపు చూచుకొన్నారు.

"చాలా ఆలస్యమైంది. తొందరగా ఒక చోటికి వెళ్ళాలి మరి. ఇన్ని విషయాలు చెప్పానా, స్వవిషయం చెప్పడం మరిచాను. నేను ఊరు విడిచి నెలరోజులైంది. వాలి

బారికి వెరచి సుగ్రీవుడు ఋష్యమూకంలో తల దాచుకున్నాడని రామాయణం చెబుతుంది. ఇప్పుడు రామదుర్గంలో మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి. తమ పరువు ప్రతిష్ఠల నన్నింటినీ పణంగా పెట్టి ఉభయ వర్గాలూ అక్కడ తీవ్రంగా పోటీ చేస్తున్నాయి. వాతావరణం ఒక రబ్బరు చక్రంలాంటిదైతే, వేదికలు, ప్రచార శకటాలు, గోడలపైన నినాదాలు, కరపత్రాల ద్వారా హెచ్చరికలు, పత్రికల ద్వారా ఉద్బోధనలు, మొదలైన వాటిద్వారా ఆ రబ్బరు ట్యూబులోకి ఎడతెగకుండా గాలిని పూరించడం జరుగుతోంది. ఈ ఒత్తిడిలో మామూలు మనిషి సజావుగా ఊపిరి త్రిప్పుకోవడం దుస్తరమైపోయింది. పులిమీద పుట్రలాగా రామవరం వాళ్ళొకవైపున, చీనేపల్లి వాళ్ళొకవైపున నిల్చి బాకాలు చేతికి పుచ్చుకునేసరికి నాబోటివాళ్ళ పని మరీ ఇరకాటాన పడిపోయింది. ఉభయులూ నాకు కావలసిన వాళ్ళే! ఓటును ఒక పెట్టెలోనే పడవేయడం న్యాయం. చించి రెండు ముక్కలు చేసి రెండు పెట్టెల్లోనూ పడవేయడం అన్యాయం. ఈ అన్యాయానికి పూనుకోలేకపోతే గత్యంతరం ఏమిటో తెలుసా? ఇలాగే పలాయనం...."

ప్రసంగం పూర్తయ్యేసరికి హాస్టల్లో దీపాలు వెలిగాయి.

## 2

రామదుర్గం. అదే పేరుతో వ్యవహరింపబడుతున్న జిల్లాకు ముఖ్యపట్టణం. రాష్ట్ర ముఖ్యనగరానికి వెళ్ళే ట్రంకురోడ్డు ఆ పట్టణం మీదుగా వెళ్తుంది. నగర శివార్లలో చెదరు చెదరుగా కోటగోడలు, పై కప్పు కూలిపోయిన రాతి కట్టడాలు, భూపతనమైన శిలాస్తంభాలు, బిచ్చగాళ్ళ కిరువుగా మారిన మంటపాలు మొదలైన ప్రాచీన శిథిలాలు దండిగా ఉన్నాయి. స్థలపురాణం లాంటి దేదీ లేకపోయినా, చరిత్ర గ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలించిన విజ్ఞులు ఆ పట్టణం పూర్వం కర్ణాటక నవాబుల ఏలుబడి క్రింద ఉండేదనీ, అక్కడికోటలో ఒక పాళేగాడు నివసించేవాడనీ చెబుతారు. ఆ విధంగా చారిత్రక ప్రశస్తి మాత్రమే కాదు, రామదుర్గం జిల్లాకు భౌగోళిక ప్రాముఖ్యత గూడా ఉంది. మిగిలిన జిల్లాలను బాధించినట్టుగా అతివృష్టిగానీ, అనావృష్టిగానీ రామదుర్గం జిల్లాను బాధించవు. జిల్లా అంతటా సమతల ప్రదేశాలకన్నా మిట్టపల్లాల మెట్ట భూములే హెచ్చు. కొండలపైన ఏ మాత్రం వానకురిసినా బుదుంగున నిండిపోయి మరవలు వెళ్ళే చెరువుల క్రింద మెట్ట భూముల్లో కూడా పల్లపుసాగు కొనసాగే సదుపాయం కద్దు! వానకాలంలో కొండ కొమ్ముపైన నిల్చుని క్రిందికి కలయజూచే గొర్రెల కాపర్లు పరిసర ప్రకృతిని దాసరివాళ్ళ అద్దాల దుకాణంతో ఉపమిస్తారు. దూరాన నిల్చున్న ప్రతికొండా సంతలో పచ్చటి చీర కట్టుకున్న దాసరిముసలవ్వలా గోచరిస్తుంది. ఏ తత్పర్వత సమీపస్థ జలాశయాలన్నీ విశుద్ధ దర్పణాల్లా కనిపిస్తాయి. అడ్డదిడ్డంగా క్రమ్ముకున్న పచ్చటి కొండలు, అక్కడి నుండి కొంత దూరానికి విసరివేయబడినట్టున్న గుట్టలు, వాటి మధ్య పరుగెడుతున్న వాగులకడ్డంగా చిన్నవీ పెద్దవీ అయిన కుంటలు, చెరువులు, వాటి క్రింద కొన్ని ఎకరాల మేరకు పచ్చని పంటభూములు, ఆ పరిసరాల్లో పల్లెలు – ఇదీ స్థూలంగా రామదుర్గం జిల్లా భౌతిక స్వరూపం.

ప్రకృతిలో నిమ్నోన్నతాలలాగా మనుషుల్లో మంచి చెడ్డలు తప్పనిసరి. రామదుర్గం ప్రజల స్వభావం గూడా అందుకు విభిన్నమైందేమీ కాదు. లేదంటే వాళ్ళ స్వభావంలో చెడుపాలు చాలా తక్కువ! సున్నితంగా మాట్లాడ్డం వాళ్ళ చేతగాని మాట నిజమే! కానీ వాళ్ళ మాటలెంత కటువో మనసంత మృదువు. రామదుర్గం జిల్లాలో తాటిచెట్లు హెచ్చు. పాదిపెట్టి ప్రోదిచేసి పోషించకపోయినా నిటారుగా నింగివైపు పెరిగేవి తాళవృక్షాలు. అంతే

కాదు, వంటచెరకుగా, ఇంటికి కలపగా, కుటీరాలకు పైకప్పుగా, క్రిందికి చాపగా, మండు వేసంగిలో ఒంటికి చలువచేసే తినుబండారంగా తన శరీరంలోని ప్రత్యణువునూ మానవసేవకోసం వినియోగించేది కూడా తాటిచెట్టే! మేలిముసుగులాంటి నాగరికతలో నిజ స్వరూపాన్ని దాచుకున్న నగరవాసుల మాటలకేం గానీ, రామదుర్గం జిల్లాలోని జానపదులు నైజాన్ని బట్టి చూస్తే తాటిచెట్ల వంటి మనుషులు. ఎండనక, వాననక చమటోడ్చి పనిచేయడం మాత్రమే వాళ్ళకు తెలుసు. తాము పడుతున్న శ్రమతో, తాము పండిస్తున్న పంటతో లోకోద్ధరణ జరుగుతోందని డాబులు చెప్పుకోడం వాళ్లకు తెలియదు.

రిప్‌వాన్ వింకిల్ లాంటి చిరకాల నిద్రితుడెవడైనా పాతికేళ్ళ కాలాన్ని నిద్రలో గడపి, ఇప్పుడున్నట్టుండి లేచి రామదుర్గాన్ని కలయపరికిస్తే ఆశ్చర్యపడకుండా ఉండడం సాధ్యం కాదు. అప్పుడిలా వీధులు జనసమ్మర్దంతో కిటకిట లాడేవిగావు. సందుసందుకూ బంకులు, వీధి వీధికీ హోటళ్ళు, పేట పేటకూ సినిమాలు ఆనాడు లేవు. స్తబ్దమై పడివున్న నాగరికతలో కదలిక బయల్దేరినందుకు గుర్తుగా ఆ రోజుల్లో బస్సులు, లారీలు అరుదుగా కనిపించేవి. ఈనాడవి ఒక అరగంటపాటు కనిపించకపోతే జీవితమే స్తంభించిపోయే పరిస్థితులేర్పడ్డాయి. జోగుతూ పడుకున్న కాలపురుషుడు ఒళ్ళు విరచుకుంటూ పైకి లేచి, లేవగానే పరుగెత్తడం మొదలెట్టాడు. మనుషులతనితో పరుగు పందానికి తలపడ్డారు. అంగళ్ళనిండా జనం. హోటళ్ళలో రద్దీ. సినిమా దగ్గర క్యూ. బస్సుల్లో ఓవర్‌లోడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈనాడు రామదుర్గం రామదుర్గం కాదు. అది నిర్విరామదుర్గం.

యూనివర్సిటీ పరీక్షలు ముగిసిన తరువాత పెట్టెలు పరుపులూ సర్దుకుని రామన్న, సీనప్పలు రైలెక్కి, రామదుర్గం చేరుకునేసరికి ఆ పట్టణం ఎలా వుంది?

రోడ్లు యథాప్రకారంగా భూమిపైన్నే పరుగిడుతున్నాయి. ఇండ్లు కూడా నిశ్చలంగా భూమిపైనే నిలిచి ఉన్నాయి. ఖరాబైపోయినవల్లా అన్నెం పున్నెం ఎరుగని గోడలు, ప్రతిగోడకూ రెండు నోళ్ళు. ఒకనోటితో మీ ఓటును గంట గుర్తుకే వేయమని ఆదేశం! మరొక నోటితో అదే ఓటును సైకిలు గుర్తుకు ఎందుకు వేయరాదని సందేశం!

"పరీక్షలయిపోయాయట్రా రామం" ప్రశ్నించాడు భీమన్న.

"అయిపోయాయి నాన్నా! బాగానే వ్రాశాను. క్లాసు రావచ్చు. సీనప్ప గూడా బాగానే వ్రాశాడు..."

"ఒకరి సంగతి నీ కెందుకురా రామం! నేను చెబుతున్నానుగా. నువ్వు వినాలి మరి! ఆ సీనప్పను నువ్వికపైన నూనె వ్యాపారస్థుల సంఘంలోనైనా కలుసుకోవు. ఎందుకంటే వాళ్ళకొకటిగా, మనకొకటిగా ఇప్పుడు వేర్వేరు సంఘాలున్నాయి..."

హతాశుడై పోయిన రామం తండ్రిగారివైపు శూన్యదృక్కులతో చూస్తూ, ఏదో చెప్పబోయి నోటమాటరాక స్తబ్దుడై ఊరుకున్నాడు.

ఎంతగా మనస్కరించక పోయినా మరునాటి ఉదయం మండీలవైపు బయల్దేరాడు రామన్న. పూలదండ మినహాగా సర్వ సన్నద్ధంగా ఉన్న పెద్ద గుమాస్తా అతనికి సింహద్వారం దగ్గరే ఎదురయ్యాడు.

"రండి రండి చిన్నబాబుగారూ! మీరొస్తారని పెదబాబుగారు నాలుగు రోజులప్పుడే చెప్పారు. మేమూ వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాం. ఇదిగో, ఇదే తమ సీటు, కాఫీ పుచ్చుకుంటారా బాబూ!"

"వద్దు. పుచ్చుకునే వచ్చాను" అన్నారు రామన్న. కాసేపు మౌనంగా ఉండి ఏదైనా మాట్లాడకపోతే బాగుండదన్న ఊహతో "ఈరోజు మంచినూనె రేటెంత?" అన్నాడు.

"నిన్నటి రేటు ముప్పై రెండు రూపాయలండీ చినబాబుగారూ! ఈ రోజు రేటింకా తేలలేదు..."

"అలాగా! ఎప్పుడు తేలుతుందది?"

"ఏముందీ! రామప్ప మండీలో రేటు తెలుసుకోవడం - మనం అంతకన్నా ఒక రూపాయి తగ్గించడం..."

"రేటు తగ్గించడంలో వాళ్ళు గూడా మనతో పోటీ పడితే?"

పెద్ద గుమస్తా పక్కున నవ్వేశాడు. "రేటు తగ్గిన కొద్దీ సరుకులో కల్తీ పెరుగుతుందండీ చినబాబుగారూ! అదే వ్యాపారంలో ఉన్న కిటుకు. ఆ రామప్పకు నూనె వ్యాపారంలో ఓనమాలు నేర్పించింది మనం - మరి మనకు నామాలు పెట్టడం అతడి తరమా? మీ కెందుకూ, మీరూరుకోండి! అన్ని విషయాలూ నేను చూచుకుంటానుగా..."

ఏడ్చినట్టే ఉంది నువ్వు, నీ వ్యాపారమూ - స్వగతంగా అనుకున్నాడు రామన్న.

మండీలో ఒకటే నూనె జిడ్డువాసన. అక్కడి మనుషుల ధోరణి మరీ దుర్భరంగా ఉంది. తమ వ్యాపారం తమ లాభం కోసమేనన్న వ్యాపారదృష్టి గూడా వీళ్ళల్లో లుప్తమై పోయింది. తమ వ్యాపారం ఎదుటివారిపైన దెబ్బతీయడానికే నన్న కక్షమాత్రం బాగా బలిసింది. ఈ జాడ్యాన్ని బాగు చేయడానికి మందులున్నాయో లేవో తనకు తెలియదు.

మండీనుంచి వెలుపలికి వచ్చాడు రామన్న. మరుభూమిలో గుంపునుంచీ విడిపోయిన సార్థవాహుడిలా కొంతసేపు పురవీథుల వెంట తిరిగాడు. ఆపైన ఇంటికి వెళ్ళి భోజనం చేశాడు. దిగులుతో నిండిన మనసు మబ్బులలముకున్న ఆకాశంలా ఉంది. అలాగే వాలుకుర్చీలో మేను వాల్చింది మాత్రమే తెలుసు. ఎప్పుడో నిద్ర ముంచుకొచ్చేసింది.

ప్రొద్దుపోయి చీకటి పడుతుండగా గదిలోకి తొంగి చూచాడు భీమన్న. "అదేమిట్రా రామం! సాయంకాలం మండీకేసి వెళ్ళలేదా?" హాల్లోనుంచే ప్రశ్నించాడు.

"లేదు నాన్నా! ఉదయం వెళ్ళొచ్చాను" అన్నాడు రామన్న.

"అలాగైతే కుదరదురా అబ్బీ! ఇది కాలేజీ కాదు - ఇష్టమైతే వెళ్ళడానికి, లేకుంటే మానుకోడానికి. పగలు పన్నెండు గంటలూ మనమక్కడ లేకపోతే బేరసారాలు సజావుగా జరగవు. గుమాస్తాలను నమ్మడానికి వీల్లేదు..."

ఇంతగా వ్యాపారాన్ని తనకప్పజెప్పి ఇంటిపెద్దలు చేస్తున్న నిరవాక మేమిటో రామన్న కర్థమైంది కాదు. వాకబు చేసి తెలుసుకున్నాడు. జిల్లాలో పంచాయతీనుండి పరిషత్తు వరకూ గ్రామ సహకార సంఘం నుండి జిల్లా మార్కెటింగ్ సొసైటీ వరకూ ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగుతుంటాయట! చీమ చిటుక్కుమన్న ప్రతిచోటా వీళ్ళు హాజరు కావలసిందేనట!

సినిమాల్లోలాగా ఓ చీటీ వ్రాసిపెట్టి ఎక్కడికైనా పారిపోదామని గూడా అనుకున్నాడు రామన్న. కానీ మోసులెత్తనివ్వకుండా ఆ అభిప్రాయాన్ని అక్కడే తుడిచిపెట్టేశాడు. పారిపోవడం గాదు ఉండి పరిస్థితులను ఎదుర్కొనడమే పురుష లక్షణం.

కానీ మళ్ళీ కొద్దిరోజులకే అనిశ్చితాభిప్రాయం తల్లక్రిందులుగాక తప్పలేదు. ప్రమిదెలో నూనెకంటుకపోయిన శలభానికి దీటోగా ఉంది తన పరిస్థితి. ఊబిలో దిగబడిపోతూ నిస్సహాయంగా తల పైకెత్తి ఆకసం వైపు చూస్తున్న ఆవు దూడకు నకలుగా

ఉంది తన పరిస్థితి. నిజానికి మండీలోనైనా పర్యవేక్షణ ఒక్కటీ తప్పితే, తాను చేయవలసిన పనేమీ లేదు. ఈ నిర్వ్యాపారత్వంలో, ఈ విద్వేష పూరిత వాతావరణంలో రోజులు దొర్లించడంకన్నా పారిపోవడమే మేలు!

అంతపని చేసే వాడే రామన్న! చివరి ఘట్టంలో కథ మలుపు తిరిగినట్టుగా ఓ రోజు సాయంకాలం దీపదీపాలవేళ జనసంచారమంతగా లేని ఓ మారుమూల మిత్రులిద్దరూ ఒకరికొకరు పది బారల దూరంలో తారసిల్లారు. ఒక మహానది ఎదురైన కొండతాకిడికి రెండుగా చీలి మళ్ళీ ప్రవాహదశలో కొన్ని యోజనాల దూరంలో కలుసుకోవడం ఎలాంటిది? అలాంటి సమాగమం అది. పెదవులు కదిలాయి గానీ, మాటలు వెలువడలేదు. చూపులు కలిసాయిగానీ, అంతలోనే కళ్ళు చెమ్మగిల్లాయి. 'మిత్రమా! నేను క్షంతవ్యుణ్ణి. గడచిన పదిహేను రోజులూ నేను మనిషిలా బ్రతకలేదు. యంత్రంలా కాలం గడిపాను. ఎప్పటికప్పుడు తెగబడి నీ దగ్గరికి రావాలన్న కోరిక నా హృదయంలో ఉరకలెత్తని క్షణం లేదు. కానీ అలా చేస్తే రాజుగారిని వెక్కిరించిన పిచ్చివాడిలా మనం అపహాస్య భాజనులంగాక తప్పదు. అంతకంటే బలీయమైన పరిస్థితుల చేత మనమే వెక్కిరింపబడటం మంచిది' – ఈ మాటలు వాళ్ళు పరస్పరం చెప్పుకోలేదు. చెప్పుకోకపోయినా వాళ్ళల్లో ఒకరి ఇంగితమేమిటన్నది మరొకరికి స్పష్టంగా తెలుసు.

తారసిల్లిన కొద్ది క్షణాలకు మిత్రులిద్దరూ వేర్వేరుగా లేరు. పట్టుకున్నారు. ఎందుకు, ఎక్కడికి అన్న ప్రశ్నలు ఉదయించనే లేదు. ఆ ప్రశ్నల కెప్పుడో సమాధానం కూడ పలుక్కున్నట్టుగా వాళ్ళు ముందుకు నడవసాగారు.

రామదుర్గానికి ఉత్తర దిశగా రెండు మైళ్ళ దూరంలో గుట్టల నడుమ త్రోవచేసుకుంటూ ఓ చిన్న నది ప్రవహిస్తుంది. దాని పేరు శివగంగ. నదికి ఈవలా ఆవలా ఉన్న చిట్టడవి అడవిమల్లె పొదలకు ఉనికిపట్టు. ప్రతిఫలాన్ని ఆశించి ఎరుగని పవిత్ర స్నేహబంధంలాంటి మల్లెపువ్వుల మధుర సౌరభం రాత్రి గడవనూ గడవనూ మరింత మధురంగా, మరింత మానసానందకరంగా శివగంగ ఇసుక తిన్నెలపైకి వ్యాపిస్తుంది.

మిత్రులిద్దరూ లేత వెన్నెల్లో ఓ ఇసుక దిబ్బపైన కూర్చున్నారు.

అరగంట సేపు నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని మొదట భంగపరచినవాడు సీనప్ప. ఉన్నట్టుండి అతడు నవ్వసాగాడు. ఆ నవ్వు రామన్నకు సుపరిచితమే! సుదీర్ఘంగా ఆలోచించి ఓ అపూర్వమైన విపరీతాన్ని పసికట్టినప్పుడల్లా సీనప్ప అలాగే నవ్వుతాడు.

"ఏం చెప్పమంటావురా రామం! మనం చూస్తూ చూస్తూ ఉండగానే మానవత్వానికి సంబంధించిన విలువలన్నీ తారుమారై పోతున్నాయి. ఈనాడు మనమొక పెద్ద మనిషిని సత్యహరిశ్చంద్రుడంటామనుకో, ఇతరుల సంగతలా ఉంచు – అతడే నమ్మడు! నమ్మకపోవడం అటుండగా చొక్కా చేతులు పైకి మడిచి మనతో ద్వంద్వ యుద్ధానికి గూడా తలపడతాడు. ఒక ఆసామిని చూపించి ఈయన గొప్ప ప్రజాసేవకుడంటా మనుకో! ప్రజలేమంటారో తెలుసా? 'బాబ్బాబూ! ఈయనకు పదివేల దండాలు. మా బ్రతుకేదో మమ్మల్ని బ్రతకనిస్తే చాలు అదే పదివేలు' అంటారు. ఈ లెక్కన సిద్ధాంతాలకు సరిక్రొత్త వ్యాఖ్యానాలతో శాస్త్రాలను, పదాలకు క్రొత్త అర్థాలతో నిఘంటువులను సవరించుకోవలసిన దురవస్థ మానవ జాతికిక ఎంతో దూరంలో వున్నట్టు లేదు..."

"నిజమేరా సీనూ! కాలం మారిపోతోంది" అన్నాడు రామన్న.

"మారిపోతున్నది కాలం కాదు, మనుషులు. మనుషులు జీవించడానికి తిండీ నీళ్ళూ అవసరం. కానీ జీవనోత్సాహానికి వాటికి మించిన వ్యాపకాలు అవసరం. అలాంటి వ్యాపకాల్లో ఈనాడు ప్రప్రథమంగా చెప్పుకోదగినవి రాజకీయాలు. ఎవడి స్థాయికి తగినట్టుగా వాడు భగవంతుడిని గురించి ఊహించడం లేదా రామం! రాజకీయాలూ అంతే! పెద్దవాళ్ళ సంగతలా ఉంచు. మీ ఇంట్లో ఓ నౌఖరున్నాడు. వాడిపేరు వీరప్ప. తాను వీరాంజనేయుడినని వాడి భావన. తాను పాల్గొన్న కొట్లాటలన్నీ వాడిపాలిటికి సురాసుర సంగ్రామాలు. అన్నలు పెట్రేగిపోతున్నారనీ, తనలాంటి వాళ్ళు ఆదమరిస్తే కొంపలు మునిగిపోతాయనీ వాడి నమ్మకం. అందువల్ల అవసరమైనప్పుడల్లా భుజబలాన్ని ప్రదర్శించి కాస్తా కూస్తా ధర్మసంస్థాపనం చేయాలన్నదే వాడి ఆదర్శం. అంతే వాడి రాజకీయం! మొన్నటిరోజు వాడే స్వయంగా చెప్పగా తెలిసింది. నాగపట్ల తిరణాలలో వాడు ముగ్గురన్నల్ని ముదరగొట్టి తన్నేశాడట! ఈ వీరగాథను విని, వాడి ప్రతాపాన్ని మెచ్చినట్టివారై మానాన్నగారు నౌఖరీ ఇప్పించారట. గళ్ళలుంగీపైన చేతులు లేని బనీను తొడుక్కుని గేటుకు కాపలా కాయడమే వాడిపని. ఈ గేటు పొలిటీషియన్ కథ విన్నావా రామం! మా ఇంట్లో ఇంకొక కుర్ర పొలిటీషియన్ గూడా ఉన్నాడు. మా పెద్దన్నయ్య కొడుకు. పేరు చిట్టిబాబు. మరీ అంత చంటివాడు కాదులే. పన్నెండేళ్ళొచ్చాయి. ఓ సాయంకాలం తోటలో కాసేపు పచారుచేసి ఇంటికి తిరిగొస్తున్నాను. డాబాపైన నిల్చుని పిట్టగోడ పైన్నుంచీ నావైపు చూస్తూ "నిలు నిలు బాబాయ్" అన్నాడు చిట్టిబాబు. "ఏంరా చిట్టీ" అన్నాను. 'ఓ పద్యం పాడతాను వింటావా' అన్నాడు. వాడికి పాడడం వచ్చునని నాకు తెలియదు. ఈ మధ్య ఆ విద్య గూడా నేర్చాడేమోననుకొని "పాడు చూద్దామన్నాను...."

"బాగా పాడగలడా సీనూ?" తన సహజ ధోరణిలో అమాయికంగానే అడిగాడు రామన్న.

"బాగా పాడగలడా, లేదా అన్నది గాదు అసలు విషయం. వాడు పాడిన పద్యం ఎందులోనిదన్నదే నన్నెదుర్కొన్న ప్రశ్న. అది భర్తృహరి సుభాషితాల్లోనిది గాదు. శతకాలలోనిది గాదు. అందులోని మొదటి మూడు పాదాలు నాకు బొత్తిగా జ్ఞాపకం లేవు. కావలిస్తే నాలుగోపాదం మాత్రం చెప్పగలను..."

"చెప్పరా సీనూ..."

"వద్దులేరా రామం! చెబితే నీకు కోపం వస్తుందేమో!"

"నాకు కోపమా! భలే గమ్మత్తుగానే ఉందిది. చెప్పరా బాబూ చంపక..."

"అయితే వినుకోరా రామన్న! నాలుగోపాదం ఇది– అన్నలు దున్నపోతులను ఆర్యులసూక్తి ఎరుంగరోజనుల్"

"అన్నలు దున్నపోతులను ఆర్యులసూక్తా?" పగలబడి నవ్వసాగాడు రామన్న. "మన ఎరుకలో అలాంటిసూక్తిని వక్కాణించిన ఆర్యులెవర్రా సీనూ? వాళ్ళెప్పుడు పుట్టుకొచ్చారు, ఎందుకిలా సెలవిచ్చారు... ఏమిటబ్బా ఈ కథా కమామీషూ?"

"నాకూ అదే తెలిసింది కాదు, అందుకే దగ్గరికి పిలిచి బుజ్జగించి అడిగాను మా చిట్టిబాబుని, 'ఒరే అబ్బీ! పద్యం చాలా బాగుంది. మరైతే నాకొక సందేహం. అన్నలు దున్నపోతులైతే అప్పలెవరు? ఇంకా పాలిటిక్స్ పూర్తిగా ఒంటబట్టలేదేమో, కుర్రాడు నిజం బయటపెట్టేశాడు. 'వాళ్ళుమాత్రం ఊరుకున్నారా బాబాయ్! వాళ్ళల్లోనూ పాడగలిగినవారు

పాడుతూనే ఉన్నారు - అన్నలు పెంటకుప్పలను ఆర్యులసూక్తి ఎరుంగరో జనుల్... అని..."

మళ్ళీ పెద్దపెట్టున నవ్వసాగాడు రామన్న.

"ఒక్కనవ్వుతో కొట్టిపారవేయదగిన విషయం కాదురా రామం! యుద్ధాలవల్ల లోకానికి వినాశం సంభవిస్తుందని మనకు తెలుసు. కానీ ఆ వినాశనానికి సంబంధించి నంతవరకూ మనం భయపడవలసింది పదాతిదళానికి చెందిన యుద్ధ భటుణ్ణి చూచి గాదు; ఒక్కదెబ్బతో కొన్ని వందల చదరపు మైళ్ళు భస్మీపటలం చేయగల మారణాస్త్రాలను కనిపెట్టే కుశాగ్రబుద్ధి ఎవడైతే ఉన్నాడో, వాణ్ణి చూచి! మన సమాజంలో నెలకొన్న సంక్షోభాన్ని గురించి ఇప్పుడు నేను చూచాయగా చెబుతున్నాను. యుద్ధాల్లో పదాతిదళం పాత్ర ఎలాంటిదో, సమాజ సంక్షోభంలో వీరప్ప, చిట్టిబాబు మొదలైన వారి పాత్ర అలాంటిది. వాళ్ళను గురించి కాదు నేను చెప్పడం..."

నిద్రనుంచి ఉలికిపడి మేలుకున్నట్టుగా తటాలున లేచి కూర్చున్నాడు రామన్న - "చెప్పరా సీనూ! నీకు మల్లేనేనీ కల్లోలాన్ని గురించి ఆలోచించనేలేదు. పదిహేను రోజులుగా నాకొకటే ఆలోచన - ఎక్కడికి పారిపోవడమా, ఎలా పారిపోవడమా అని..."

"పారిపోవడమే తప్పనిసరైతే ఆ పని చేయవలసిన వాడివి నువ్వొక్కడివే కావు. సమస్యలను పరిష్కరించకపోతేమానె. అర్థమైనా చేసుకోకపోతే ఇక చదువులెందుకురా రామం!"

"అర్థమై ఉంటే నువ్వే చెప్పాలి. ఈ మధ్య నా బుర్ర బొత్తిగా స్తబ్ధమైపోయింది..."

"అప్పటికి నేను పెద్దగా ఆలోచించి గొప్ప రహస్యాలు కనిపెట్టినట్టు! అదేం లేదురా రామం! కానీ నేను కొంతవరకూ ప్రయత్నించినమాట నిజం! నా పరిశోధన మున్ముందుగా మా చిట్టిబాబు దగ్గరినుంచే ప్రారంభమైంది...."

సీనప్ప చెప్పసాగాడు.

"మా చిట్టిబాబు ద్వారా నాకొక వర్తమానం తెలిసింది. రామదుర్గంలో ఇప్పుడు రెండు పత్రికలున్నాయి. పత్రికల్లో ప్రకటింపబడే విషయాలకు మల్లే, వాటి పేర్లు గూడా విలక్షణమైనవే! ఒకటి - భజావోథంకా! రెండోది - గణగణ గంట! మచ్చుకొక్క పత్రిక తీసుకురమ్మన్నాను. చిట్టిబాబు గదులన్నీ వెదికి రెండు డజన్ల భజావో థంకాలను తీసుకొచ్చాడు...."

"మరైతే గణగణ గంట కనిపించలేదా సీనూ?"

"అది మాఇంట్లో ఎందుకుంటుంది? అది మీ పత్రికరా రామం! అయినా నా పరిశీలన నిమిత్తం ఎంతో కొంత ప్రయాసతో కొన్ని గణగణ గంటల్ని గూడా సంపాదించాను"

"సమీక్షించు మరి..."

"అవి మూరెడు పొడుగు, ఒకటిన్నరజాన వెడల్పుతో ఎనిమిది పేజీలకు మించని వారపత్రికలు. ధనాపేక్షతోగానీ, సేవాభిలాషతోగానీ ఇవి నడపబడడం లేదు. ఆత్మరక్షణ గావించుకుంటూ, ఎదుటివారిపైన దెబ్బతీయడం యుద్ధనీతి కదూ! ఈ పత్రికల్లో పాటించబడుతున్న నీతిగూడా అదే! ఆత్మరక్షణకు బదులుగా ఇవి ఆత్మస్తుతి గావించుకుంటాయి. ఆయుధాలతో దెబ్బతీసి దేహాన్ని బాధించడానికి బదులుగా పరుష వాక్కులతో ఇవి మనసులను గాయపరుస్తాయి. మెదడుకు మేతవేసే మాట దేవుడెరుగు-

ఇవి కలహానికి ఎడతెగని ఇంధనాన్ని సమకూరుస్తాయి. ఈ వారం ఒక పత్రిక ఒకానొక ప్రత్యేక వ్యక్తిని కలియుగ రావణాసురుణ్ణిగా చిత్రిస్తే, పైవారం రెండో పత్రిక ఇంకొక ప్రత్యేక వ్యక్తిని అభినవ బకాసురుణ్ణిగా వర్ణిస్తుంది. పోనీ ఈ బ్రతికిఉన్న మానవులు తమ కార్పణ్యాలతో తాము సతమతమైపోవచ్చును గాదా రామం! ఊంహూ, ఆ మాత్రంతో తృప్తిపడడం లేదు. చనిపోయిన వాళ్ళను కూడా రంగంలోకి తీసుకొస్తున్నారు..."

"అలాగా? అదెలా సాధ్యమౌతుంది సీనూ?"

"ఎందుకు సాధ్యంగాదు? పురాతత్త్వ శాస్త్రజ్ఞులు శిథిలాలను త్రవ్వి ప్రాచీన రహస్యాలను బయటికి తీయడం లేదా రామం! ఇదీ అలాగే జరుగుతోందని చెప్పవచ్చు. దేశంతో కాలంతో నిమిత్తం లేకుండా ప్రతి దేశంలోనూ, ప్రతి కాలంలోనూ దుర్మార్గులంటూ కొందరుండక పోరు. ఈ ప్రాంతంలో మల్లెకోన సిద్ధప్ప అన్న పేరుతో ఓ దుర్మార్గుడుండే వాడు. వాడికెందుకో గొల్లలపైన కోపం వచ్చింది. అమాంతంగా గొల్లపల్లెలో ఉన్న మేకల మందలన్నింటినీ తోలుకొచ్చి ఒకరాత్రి రాత్రంతా అడుసు మళ్ళల్లో నిలబెట్టి ఉంచాడు. తెల్లవారేసరికి మేకల్లో సగానికి సగం బిర్ర బిగుసుకుపోయి తలలు వాల్చేశాయి. అది నూరేళ్ళ క్రిందటి కథ – మూడు నెలల క్రిందట మరిన్ని చిలవలతో పలవలతో అది ఓ గణగణ గంటలో ప్రత్యక్షమైంది. అప్పటికి నేను మాత్రం నెలతక్కువగా పుట్టానా ఏమిటి అంటూ భజావోద్ధంకా 'కొంపలార్పిన కెంపన్న' అన్న పేరుతో ఓ సీరియలే ప్రారంభించింది. ఆ కెంపన్నగూడా నిన్న మొన్నటివాడు కాదు. మూడు తరాల క్రిందటివాడు..."

"ఇలా గడచిన గాథలన్నింటినీ త్రవ్వి తలకెత్తుకోడంలో వీళ్ళ ఉద్దేశం ఏమై ఉంటుంది సీనూ!"

సీనప్ప మిత్రుడి మాటల్ని వినిపించుకున్నాడు కాదు. తన ధోరణిలో తాను చెప్పుకపోసాగాడు....

"ఈ కల్లోలానికి ఎన్నికలు కారణమనుకున్నాము. అది పొరబాటు. నాగరిక దేశాలన్నింటిలోనూ ఎన్నికలు జరుగుతున్నాయి. అవి ఎక్కడా సహజీవనానికి ఆటంకంగా భావింపబడటం లేదు..."

"అలాగైతే జరుగుతున్న అనర్థాలకన్నింటికీ మూల కారణమేమిటంటావు సీనూ?"

"నిష్కర్షగా చెప్పలేము. కానీ ఇందులో ఈ పత్రికల పాత్రమాత్రం చాలా ఉంది...."

కాసేపు మౌనంగా కూర్చున్నాడు సీనప్ప. తరువాత ఉన్నట్టుండి ఆలోచనలో నుంచి తేరుకుంటున్నట్లుగా "ఎలాగూ మన మిక్కడినుంచి వెళ్ళి పోదలచుకున్నాం. ఆలోగా ఒక మంచిపని చేద్దామా రామం" అన్నాడు.

ఉత్కంఠతో మిత్రుడివైపు చూచాడు రామన్న.

"రావణాసురుడి కాష్టం ఏమాత్రం చల్లారిన చల్లారినట్టే! మనం ఈ పత్రికలు ఆగిపోయేటట్టుగా చేయలేమా రామం?"

"రామన్న హతాశుడై పోయాడు – "మనం చెబితే వినేవాళ్ళెవరున్నార్రా సీనూ?"

నిజమే! 'జీర్ణమంగే సుభాషిత' మన్న సుభాషితానికి ఇప్పుడు కలిగినంతగా మరెన్నడూ సార్థకృత కలగలేదు. సీనప్ప ఈ సత్యం ఎదుట మూకీభావం వహించక తప్పింది గాదు. నిరాశతో అతడు వేడిగా నిట్టూర్చాడు. గంట తొమ్మిది దాటింది. బరువెక్కిన గుండెలతో ఒక కాలిక్కి రాకుండా నానాముఖాలుగా సాగిపోతున్న ఆలోచనల్లో తేలిపోతూ మిత్రులిద్దరూ నగరంలోకి తిరిగివచ్చారు. ఒక శృంగాటకం దగ్గర విడిపోయారు.

## 3

మరునాటి ఉదయం నిద్ర లేచేసరికి రామన్నకొక దారుణమైన విషయం అవగతమైంది. రామదుర్గమన్న ఎడారిలో తనకున్నదల్లా ఒక్కటే ఒయాసిస్సు. అది సీనప్ప సాన్నిధ్యం! మళ్ళీ మళ్ళీ అతణ్ణి కలుసుకోవడానికి వీలుగా నిన్నటి రాత్రే ఒక రహస్య స్థలాన్ని, సమయాన్ని నిర్దేశించుకొని ఉండవలసింది. తను మరచిపోయాడు. సీనప్పకైనా సమయానికి బుర్ర పనిచేసింది కాదు. మరైతే ఇక తను సీనప్పను కలుసుకోడమెప్పుడు? రోడ్డుపైన యాదృచ్ఛిక సమాగమం కోసం తనింక ఎంతకాలం పడిగాపులు పడవలసి ఉంటుంది?

మనసులో మనసులేని రామన్న మండీలో పదిహేను నిమిషాలు మాత్రమే కూర్చోగలిగాడు. తరువాత తన కాళ్ళు తనను ఈడ్చుక వెళ్ళినట్టల్లా పురవీధుల్లో రెండు గంటలసేపు చెడతిరిగాడు. చివరికొకచోట అతడి పాదాలు అడుగు ముందుకు వేయడానికి నిరాకరించినట్టుగా ఆగిపోయాయి. అది ఇదివరకెప్పుడూ తాను చూచి ఎరుగని వీధిగాదు. అక్కడ వ్రేలాడుతున్న బోర్డునుకూడా తను లెక్కలేనన్నిసార్లు చూడనే చూచాడు. కానీ గణగణగంట కార్యాలయమంటే అక్కడ గంటలు తయారు చేస్తుంటారు కాబోలునన్న అపోహలో పడిన మాట నిజం! రామన్న చరాలున కార్యాలయంలోనికి దారితీశాడు. అక్కడ హాలులాంటి పెద్దగదిలో చిన్నా పెద్దా కలిసి పది పదిహేనుమంది పెంకులెగిరిపోయేటట్టుగా అత్యంత రసవత్తరమైన చర్చలో నిమగ్నులై ఉన్నారు.

ఓ పెద్దమనిషి చూడగానే ఆగంతకుణ్ణి పోల్చుకున్నాడు. "ఓహో భీమన్నగారి అబ్బాయా! అబ్బబ్బా, ఎంతకాలానికి వచ్చావు నాయనా ఈ వైపు! ఒరే సిసింద్రీ! పరుగెత్తుకెళ్ళి ఓ కాఫీ పట్రారా"

క్రొత్త మెంబరుకు స్వాగత సత్కారాలు నెరపడంలో మిగిలిన సభ్యులు కూడా మొదటి పెద్దమనిషికి యథోచితంగా సహకరించారు. ఒకాయన గదిలోనుంచీ కుర్చీ తీసుకొచ్చాడు. ఇంకొకాయన టేబిలు ఫానును దాపుగా తెచ్చి పెట్టాడు. వేరొకాయన రామన్నలాంటి విద్యావంతుడు, ఉత్సాహవంతుడు తనంతట తానుగా 'గణగణగంట'ను వెదుక్కుంటూ ఇలారావడం చెప్పుకోదగ్గ విశేషమని చెబుతూ మురిసిపోయాడు.

టేబిలుపైన్నుంచీ తన మ్రోలకు తీసుకురాబడ్డ గణగణగంటల్ని పరికిస్తూ రామన్న మాత్రం మౌనంగా కుర్చీలో కూర్చున్నాడు.

కాఫీ కోసం వెళ్ళిన సిసింద్రీ కాఫీకంటే వేడిగా ఓ వర్తమానం పట్టుకొచ్చాడు. గడచిన రాత్రి భజావోఢంకా కార్యాలయంలో దొంగలు పడ్డారట! దొంగలు పడిన సంగతి ఉదయం తలుపులు తీసి చూచుకున్నాక గానీ తెలిసింది కాదు. వేసిన తలుపులు వేసినట్టే ఉన్నాయి. పడిన దొంగలు వెల్తురుకోసం పైకప్పు కమర్చిన అద్దాన్ని ఊడబెరికి లోపలికి దిగారు. పాపం, ఇంత శ్రమపడీ వాళ్ళు తీసుకపోయిందేమీ లేదు. తీవ్రమైన రిపేరీలకు గురిచేస్తూ ప్రింటింగ్ ప్రెస్సును మాత్రం ధ్వంసం చేసి వెళ్ళారు.

ఈ వార్త ఆ గదిలోకి రావడం రావడమే ఆనంద సముద్రంలోకి ఉప్పెనలా వచ్చింది. అయాచితంగా ఓ వంద రూపాయల నోట్లకట్ట జేబులోకి వచ్చిపడితే కలిగే ఆనందాన్ని పోలిక తీసుకరావచ్చు! - సరైన శాస్తి, నాలుగైదుసార్లు ఇలా జరిగితే చిరిగిపోయిన భజావోఢంకాకు మళ్ళీ మళ్ళీ తోలు కుట్టించడం వాడి జేజినాన్న తరం కాదు.

రామన్న పానకంలో పుడకలా అడ్డు తగిలాడు - "కానీ వాళ్ళయినా ఈ పాతాన్ని తిరిగీ మనకప్పగించరన్న నమ్మకమేమిటి?"

నాగలోకంలో మయూరక్రేంకారంలా, మంచి సంగీతంలో నెలకొన్న సంబరంలో అపశృతిలా, రామన్న ప్రశ్న రసభంగానికే దారి తీసింది.

"అదేమి టబ్బాయ్! అప్పటికి అప్పులు మాత్రం తక్కువగా రొప్పారా ఏమిటి? మనకిప్పటికిది మూడో కార్యాలయం. మొదటి రెండూ ఏమయ్యాయో నీకు తెలియదు.... ఇక్కడ పట్టణంలో కాలిపోతున్నవైనా కూలిపోతున్నవైనా ఇళ్ళేననుకో! బయట పల్లెల్లో పంటపొలాలు పేరు చెప్పకుండా పోతున్నాయి. గాలివానా లేకపోయినా చెట్లు మొదటికి విరిగి పడిపోతున్నాయి..."

"అలాంటి వైపరీత్యాలు జరుగగూడదన్నదే నా ఉద్దేశం! మనుషులు తమ కోపతాపాలను మనుషుల పైన్నే చల్లార్చుకోవచ్చు. అలాకాకుండా మధ్యలో ఇళ్లను మళ్ళనూ, ఫలవృక్షాలను పరికరాలను నాశనం చేయడం ఏం న్యాయం?"

"అవకాశం దొరికితే మనుషుల్ని మాత్రం ఊరికే వదిలేస్తారా? తలకాయలు సొరకాయల్లా ఎగిరిపోవూ! అందుకు కాకపోతే మన ప్రెస్సులో పనిచేసే కంపోజిటర్లను కాపలాతో పిలుచుకొచ్చి కాపలాతో త్రిప్పిపంపడమెందుకు? ఆ మాటకొస్తే బయటి ప్రపంచానికి కనిపించకుండా అండర్‌గ్రౌండులో కాలం గడుపుతున్న వాళ్ళెందరో నీకేం తెలుసు?

నిజమే! తనకేం తెలుసు? ఒక క్రొత్తచోటికి వెళ్ళినప్పుడల్లా, తనకెన్నో క్రొత్త విషయాలు తెలుస్తూనే ఉన్నాయి. కానీ తెలిసిన ప్రతి విషయమూ మరికొంత ఆందోళనకూ, ఆవేదనకే దారితీస్తోంది.

ఎంతగా తనకు ఓపిక లేకపోయినా ఆ మధ్యాహ్నం ఎండలో మాడిపోతూ మెల్లగా ఇల్లుచేరుకున్నాడు రామన్న. స్నానాలగదిలో ప్రవేశించి ఓ బాయిలరు నీళ్ళను తలపైన దిమ్మరించుకున్నాడు. సుష్టుగా భోజనం చేసిన తర్వాత పడకగదిలో ప్రవేశించి, శుభ్రంగా బిచాణా పరచుకుని ముసుగు బిగిదన్నేశాడు. ఇదంతా అనాలోచితంగా జరిగిపోతున్న కార్యక్రమం గాదు. దీనికి వెనుక ఒక నిర్దిష్టమైన పథకం ఉండనే ఉంది. సాగదీసి లెక్కవేసినా సరే ఇంక పదిరోజులకు మించి తనీ ఊళ్ళో ఉండలేదు. ఈ పదిరోజుల్లో తనెంత అప్రయోజకుడుగా లెక్కగట్టబడితే అంతమేలు!

అందుకనే పగటిపూట రెండువేళలా మండీకి వెళ్ళవలసిన తన బాధ్యతను గూడా రామన్న సమూలంగా తుడిచిపెట్టేశాడు.

ప్రొద్దుపోయి చీకటి పడింది. దీపాలు వెలిగించిన తరువాతెప్పుడో రామన్నకు తెల్లవారింది. నిద్రలేవగానే అతడు తన ట్రంకు పెట్టెనంతా గాలించి ఓ సీమ సున్నపు ముక్కను పైకి తీశాడు. మూసివున్న తలుపుపైన ఆ సుద్దముక్కతో ఒక గీత గీశాడు. తనీ బందిఖానాలో ఉండటానికి పెట్టుకున్న గడువులో ఒకరోజు గడచి పోయిందన్న మాట!

ఒకటి రెండయింది. రెండు మూడైంది. ఆ రోజు సాయంకాలం రామన్న నాలుగోగీత వేయబోతున్నాడనగా ఓ చిన్న సంఘటన జరిగింది.

సంఘటన చిన్నదే! కానీ ఒక్కొక్కప్పుడు చిన్న సంఘటనలే మహత్తర పరిణామాలకు సింహద్వారాలు కావచ్చు!

టేబిలుపైన తనకో కవరు కనిపించగానే రామన్న ఆశ్చర్యచకితుడైపోయాడు. బాహ్యప్రపంచంనుండి తనతో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సంబంధం పెట్టుకోదలచే వారు తన ఊహకందినంతలో ఎవరూ లేరు. కవరు చించి చూచిన తరువాత అంతగా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదని తేలిపోయింది. ఉత్తరం వ్రాసినవాడు సీనప్ప! వడిశిల దారం నుండి రాయి విసిరినట్టుగా ప్రారంభమైంది ఉత్తరం. "ఒరే రామం! నువ్వెక్కడపడి నిద్రపోతున్నావో నాకు తెలియదు. నిద్రపోకుంటే నువ్వు ఎక్కడో ఒకచోట రోడ్డుపైన్నయినా నాకు తారసపడి ఉండేవాడివి. ఎందుకంటే నాలుగు రోజులుగా నేనీ ఊళ్ళో తిరగని వీధి లేదు. ఉన్నట్టుండి నిన్ను అత్యవసరంగా కలుసుకోవలసిన అవసరం గూడా ఏర్పడింది. ఎలా కబురు పంపను! చివరికీ ఉపాయం తోచింది. జాబు వ్రాసి పోస్టు చేస్తున్నాను.

"శివగంగ ఇసుక తిన్నెలపైన ఇటీవలి మన సమాగమంలో అప్రయత్నంగా నా నోటివెంట పరిశోధన అన్నమాట దొర్లింది. ఇప్పుడు నిజంగా అపరాధ పరిశోధనే ప్రారంభమైంది. నాకొక అసిస్టెంటు కావాలి. జీతమూ, బత్తెమూ లేని ఉద్యోగం. ఉద్యోగ కాల పరిమితి గూడా నాలుగైదు రోజులే! ఆర్డరు చేతికందిన మరుక్షణం నుంచి ఉద్యోగంలో చేరినట్టు భావింపవలసి ఉంటుంది.

నా అసిస్టెంటుగా నువ్వు చేయవలసిన మొదటి పని ఇది - గణగణగంట కార్యాలయానికి వెళ్ళి ఈ క్రింది వివరాలు సేకరించాలి. ఒకటి: పత్రిక కోసం పనిచేస్తున్న రచయిత లెందరు? రెండు: వాళ్ళపేర్లేమిటి? మూడు: వాళ్ళెక్కడ నివసిస్తున్నారు?

సాయంకాలం ఎనిమిదోగంటకల్లా ఈ వివరాలు నా గుప్పిట్లో ఉండాలి. ఒకానొక అంచనాపైన నేను తుపాకీని చిమ్మచీకటిలో దెబ్బగొడుతున్నాను. నా ఊహ సరైన మార్గంలోనే గనుక పయనిస్తున్నట్టయితే గురి తప్పిపోగూడదు. ఇప్పటి కింతకంటే చెప్పలేను. లబ్బీపేట చివర రైల్వేగేటు దగ్గర నీ కోసం వేచిఉంటాను...."

రామన్న కొకక్షణం తన మిత్రుడు ఉన్మాదానికి అభిముఖంగా పరుగిడుతున్నాడేమో ననిపించింది. కాకపోతే తుపాకీ ఏమిటి? గురిపెట్టడమేమిటి? తన పిచ్చి తన కానందమనుకో తననుగూడా ఊబిలోకి ఉరకమనడమేమిటి?

కానీ ఈ వైముఖ్యం రామన్నకూ అతడి మిత్రుడికీ మధ్య అడ్డుగోడ మాత్రం కాలేకపోయింది. దాని దోవ దానిది కాగా, తన దోవ తనదిగా అతడు నగరంలోకి వెళ్ళాడు. గౌరవనీయులైన సభ్యులందరూ ఉపాహారాలకు, షికార్లకు వేంచేశారేమో, గణగణగంట కార్యాలయం ఇంచుమించు నిర్జనంగా ఉంది. ప్రెస్సులో పనిచేస్తున్న వాళ్ళనొకరినిద్దర్ని మినహాయిస్తే-తనకు తెలిసిన వాడొక్క సిసింద్రీ మాత్రం కనిపించాడు. ఎన్నడూ లేనిది రామన్న వాడి ఎదుట కాస్తా లౌక్యాన్ని ప్రదర్శించక తప్పింది కాదు-

"ఏమిటోయ్ సిసింద్రీ!" నెమ్మదిగా ప్రారంభించాడు రామన్న - "మా నాన్నగారి నెరుగుదువా నువ్వు?"

"అదేమిటండీ చినబాబుగారూ! భీమన్న గారినే తెలీక పోవడమా! ప్రతినెలా ఈ పత్రిక్కి పాతిక రూపాయలు చందా ఇస్తుంటారు గూడా! వెళ్ళి తీసుకొచ్చేవాణ్ణి నేనే! వెళ్ళినప్పుడల్లా నాకో పావలా బక్షీసు ఇస్తుంటారు గూడా!...."

"అలాగా! మరైతే మీ పత్రికకు మాసిక చందా పాతిక రూపాయలన్నమాట! అవునా సిసింద్రీ?"

"అబ్బే, ఈ పత్రిక్కి నికరంగా చందాలంటూ లేవండీ చినబాబుగారూ! వాళ్ళ వాళ్ళ అంతస్థుకు తగ్గట్టుగా వాళ్ళిచ్చుకుంటారు. నెలకొక వెయ్యిరూపాయలదాకా ప్రోగౌతాయి. ఇంకా 'బీడీలు త్రాగండి, సిగరెట్లు ముట్టించండి' అంటూ డబ్బాలు మ్రోగించినందుకు ఇంకో వెయ్యి రూపాయలు ముడతాయి. ఆ డబ్బుతో పత్రికచ్చు వేసి ఉచితంగా పంచిపెట్టడమే పని!"

"తిలాపాపం తలాకొంచెం పంచడమన్న మాట! బాగానేఉందిగానీ పత్రిక నడపడానికి అంత డబ్బా అవసరమే నంటావా సిసింద్రీ!"

"కాదండీ మరి! ఇక్కడికొచ్చి కూర్చునేవాళ్ళ కాఫీ టీలకయ్యే ఖర్చుగూడా అందులోంచే చెల్లించబడుతుంది. పత్రిక కోసం పనిచేసేవాళ్ళు పది పన్నెండు గురున్నారా? వాళ్ళల్లో ఒక్కొక్కరికీ ఒక్కొక్కప్పుడు తిక్కమళ్ళి పనిలోంచి నిల్చిపోతుంటారు. అలా అన్నప్పుడల్లా వాళ్ళ కదనంగా ఓ వంద రూపాయలు పారేయవలసి వస్తుంది. ఎలాగైనా పత్రిక నడిస్తే చాలు - రూపాయ చిల్లపెంకు..."

"నిజం, నిజం! ఎన్ని ఇబ్బందులెదురైనా ఇలాంటి పత్రికమాత్రం నిల్చి పోగూడదు. నేనూ చూస్తున్నానుగా! చదవగా చదవగా చవులూరించే విషయాలొస్తున్నాయి. రసగుళికల్లాంటి రచనలు, గోలకొండ మిరపకాయల్లాంటి ట్రుమీలు. అక్షరమే లక్ష చేస్తుందనుకో! ఎవరబ్బా ఇంత బాగా వ్రాస్తున్న వాళ్ళన్నదే నా సందేహం!"

"ఆ సందేహం మీకూ ఎదురైందీ! ఆ రాసే వాళ్ళెవరోగానీ అబ్బ అబ్బ ఏం తెలివి, ఏం చొరవ అంటూ మనవాళ్ళందరూ ఒకటే పొగడ్డం! ఆ అప్పలనేవాళ్ళకే గనుక మానాలు, అభిమానాలు ఉంటే తారున ఊపిరి వదిలేయరటండీ? అది కత్తికోతగావచ్చు. బాకుపోటుగావచ్చు. రాతకంత పదనెక్కడిది బాబూ?"

"నేనొక మాటడుగుతాను సిసింద్రీ! ఆ రాసేవాళ్ళెవరన్న సంగతి మరెవరికీ తెలియకపోవచ్చు. కానీ నీకైనా తెలియదంటే నేను నమ్మను".

"బాబ్బాబూ, దేవుడితోడు! రాసే వాళ్ళదగ్గరనుంచీ రచనలు చేరవేసే వాళ్ళను మాత్రం నేనెరుగుదును. వాళ్ళయినా వారానికొకటి రెండుసార్లు మాత్రమే కనిపిస్తారు. కళ్ళు తెరచుకుని చూస్తుంటామనుకోండి - ఈ క్షణాన కనిపించినవారు మరుక్షణాన మటుమాయమైపోతారు. జాగ్రత్తగా ఉండాలి గదండీ మరి! హమేషా నిగా పెట్టి పొంచి చూస్తుండే అప్పలు, వీలు దొరికితే సున్నంలోకి వీళ్ళ ఎముక లెన్నిఉన్నాయని ఎంచెయ్యరూ....?"

"కావచ్చు! అలాగైతే ఈ పత్రికను నడపడం మనవాళ్ళపాలిటికి కత్తిమీద సాములా ఉందన్నమాట!"

"అంతకంటే తేలిగ్గా మాత్రం లేదు. ఆ మాటలకొస్తే అప్పలు గూడా వాళ్ళ తంటాలేవో వాళ్ళూ పడుతూనే ఉన్నారు. వాళ్ళు మాత్రం తక్కువరాతలు రాశారా ఏమిటి? అన్నల్ని దున్నపోతులన్నది వాళ్ళ పత్రికే గాదూ! వాళ్ళేమో సింహాలున్నూ, మనం గ్రామసింహాలమా! అయినా ఎన్ని దమ్ములండీ వాళ్ళకి! వాళ్ళెవరిచేత రాయిస్తున్నారో తెలిస్తేనా..."

రామన్న నవ్వేశాడు - "మనం తెలియనిస్తున్నాం గనుకనా! ఇదిగో సిసింద్రీ! ఈ ఊరి కాపూరెంత దూరమో ఆఊరికి ఈఊరు అంతేదూరం! ఎవరి జాగ్రత్తలు

వారికుంటాయి. ఇందులో ఒకరికొకరు తీసిపోయే వాళ్ళేమీ కాదు. చిలికి చిలికి ఈ గాలివాన ఎక్కడికి దారితీస్తుందో చూడాలి"

ఉన్నట్టుండి రామన్న ఇలా తటస్థదృక్పథం అవలంబించేసరికి సిసింద్రీ నిర్విణ్ణుడై పోయాడు. వాడి దృష్టిలో అన్నల రక్తం ఒడలిలో ప్రవహిస్తున్న నరమానవుడెవడూ ఇలాంటి రాజీధోరణి అవలంభించడు! కామవరం భీమన్న గారి అబ్బాయి పులికడుపున పుట్టి మేకలా మాట్లాడుతున్నాడేమిటి? పైగా చదువుకున్న వాడుకూడానట! చదువులు మనిషిరక్తంలో ఉన్న శౌర్యాన్ని చంపేస్తాయా ఏమిటి కర్మ....

కార్యాలయం నుంచి బయటపడేసరికి రామన్న అంతరంగం మరింత కల్లోలితమై పోయింది. ఇప్పుడు తాను సేకరించిన వివరాలు సీనప్ప కెంతవరకూ ఉపకరించ గలవన్నది కాదు ప్రశ్న. తాను సేకరించిన వివరాలేమిటో తనకే అంతుబట్టడంలేదు. కానీ, ఒక వాస్తవం మాత్రం తేటతెల్లంగా విశదమైంది. సీనప్ప సంగతి ఏమిటోగానీ తానుమాత్రం పత్తేదారుగా సుతరామూ పనికిరాడు!

అయినా ఈ పత్రికలు, ఈ రచయితలు, ఈ వైషమ్యాలు ఈ పోరాటాలు వీటి గొడవ తమకెందుకు? ముందువెనుకలు ఆలోచించకుండా కళ్ళు మూసుకుని పరుగిడేవాళ్ళ గతేమౌతుందన్న విషయాన్ని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించనే నిరూపించింది. ఏది ఎలా జరగాలో అలాగే జరుగుతుంది. చరిత్ర గతికి అడ్డు తగలడానికి తానైనా, సీనప్పయినా ఎంతటి వాళ్ళు?

లక్ష్మీపేట చివర రైల్వేగేటు దగ్గర మిత్రుడికోసం ఎదురు తెన్నులు చూస్తున్న సీనప్ప తరహా మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. తలకొక టోపీ పెట్టుకొని, ముఖం సరిగ్గా కనిపించకుండా చెవులపైనుంచీ పెదవుల కడ్డంగా మఫ్లర్ చుట్టుకుని, వేపచెట్టు క్రీనీడలో నిల్చున్న సీనప్ప కనిపించగానే రామన్న అన్నాడు - "ఏమిత్రా సీనూ! నీ కెందుకో ఆకాశానికి మూడేబారలన్నంత ఉత్సాహంగా ఉంది. కానీ ఎంత ఉత్సాహంగా ఉన్నా నువ్వు షెర్లాక్ హోమ్సు, హెర్క్యుల్ పారైట్, పెర్రీమాసన్‌లవంటి జగద్విఖ్యాత డిటెక్టివ్‌లకు మల్లే ఇలా పోజులు పెట్టడం మాత్రం బాగుండటం లేదు. మహావీరులను అనుకరించబోయి నవ్వులపాలైన డాన్ క్విక్ సాట్ కథ నీకు తెలియందికాదు...."

"నువ్వు పుస్తకాలు చదివినంత జాగ్రత్తగా లోకాన్ని పరిశీలించవురా రామం!" చెంపపెట్టులా అడ్డుతగిలాడు సీనప్ప. మిత్రుణ్ణి వేపచెట్టు క్రిందటి రచ్చపైన కూర్చోపెట్టాడు. "ఇదంతా నీ పాలిటికి నవ్వులాటగా కనిపిస్తుందని నాకు తెలుసు. కానీ ఎట్టి పరిస్థితిలోనైనా నా మాటపైన నీకు గురివుండి తీరుతుందనే నా నమ్మకం! లేకుంటే నిన్ను పిలిపించే వాడినే కాను..."

"పోనీలే సీనూ! మాటవరుసకిదంతా గొప్ప పరిశోధనేననుకుందాం! గాలితో కుస్తీపట్టినట్టుగా దేనిపైన ఈ పరిశోధన? ఈ ప్రయత్నాలన్నీ ఫలించి మనం ఆ రచయితల్ని వెదికి పట్టుకున్నామని కూడా అనుకో! మనకు అంతటితో ఒరిగేదేముంది? పోనీ ఆ వెదకి పట్టుకోడమైనా ఇప్పుడిప్పుడే సాధ్యమయ్యే సూచనలు లేవు...."

"ష్ ఊరుకోరా రామం!" గట్టిగా వారించాడు సీనప్ప. "రచయితల్ని వెదికి పట్టుకోదలచడంలో నా ఉద్దేశం ఇది - ఎలాగైనా రచయితలు బుద్ధిజీవులు. తమ ఈ రచనలవల్ల లోకానికి అపకారం జరుగుతోందన్న నిష్ఠురసత్యాన్ని వాళ్ళు అవగతం చేసుకోకపోరు. నచ్చజెప్పి వాళ్ళ మనసును మార్చడానికి వీలుంటుందేమోనని నా ఆశ.

కానీ ఒకటి మట్టుకూ నిజం! పసిగట్టి వాళ్ళనుపట్టుకోడంలో నేనూ ఇంతవరకూ కృతకృత్యుణ్ణి కాలేకపోయాను".

"మరికొంత కాలంలో కృతకృత్యులం కాగలమన్న నమ్మకమైనా ఉందా నీకూ?"

"అదే చెబుతున్నాను. రచనలద్వారా ఈ రచయితల చదువును గురించి, సంస్కారాన్ని గురించి ఓ నిర్ణయానికి రావాలన్న కుతూహలం కలిగింది నాకు! శైలినిబట్టి రచయిత వ్యక్తిత్వాన్ని అంచనా కట్టవచ్చునని పెద్దలు చెప్పనే చెప్పారు. నాకు సాధ్యమైనంతలో వీలైనన్ని భజావోఢంకాలను, గణగణగంటలను సేకరించాను. వరుసగా నాలుగు రాత్రులు వాటిని పరిశీలిస్తూ కూర్చున్నాను. ఇదంతా ఒక కొండను త్రవ్వడం లాంటి పని! ఓపికతో ఇంతపనిచేస్తే చివరకు ఎలుకలు దొరుకుతాయన్న నమ్మకమైనా లేదు. కానీ ఈ పనిపైన నాకున్న ఆసక్తి, ఫలితాన్ని గురించి నాకున్న అనుమానాల్ని సైతం అవ్వలికి నెట్టింది. ఈ పరిశీలనవల్ల తేలిన సారాంశమేమిటో చెప్పమంటావా రామం?"

"సావధానంగా ఉన్నాను" అన్నాడు రామన్న.

"రచన కంటికి కనిపించే స్థూల జగత్తులాంటిది. ఈ స్థూలజగత్తులో నుంచీ దీనిని సృష్టించిన శక్తి యొక్క స్వరూప స్వభావాదులను గురించి పోల్చుకోడానికి మానవుడు ప్రయత్నించడం లేదా రామం! అలాగే రచనలో నుంచీ దానికి వెనుకనున్న రచయిత యొక్క విషయ పరిజ్ఞానాన్ని, భావ ప్రకటనా వైశారద్యాన్ని చిత్తసంస్కారాన్ని మనం పోల్చుకోడానికి ప్రయత్నించవచ్చు. ఈ పత్రికల్లో ప్రకటింపబడుతున్న రచనలు స్థానిక విషయాలకు సంబంధించినవే గావచ్చు. కులాహంకారమన్న నీచమైన మనోప్రవృత్తిని రెచ్చగొట్టేవే గావచ్చు. కానీ మామూలు పూలమొక్కలను పెంచుతున్న తోటమాలికన్నా విషవృక్షాలను పైరుచేస్తున్న తోటమాలి గొప్పవాడు కాదనగలమా రామం! వాడికన్నా వీడు నిస్సంశయంగా సమర్థుడు. ఈ పత్రికలకు దొరికిన రచయిత లెవరో నాకు తెలియదు. వాళ్ళు ఏ లౌకిక ప్రయోజనం కోసం ప్రలోభపడి ఇలాంటి పాడుపని చేస్తున్నారో తెలియదు. కానీ వాళ్ళు తలచుకుంటే ఉత్తమ రచనల ద్వారా లోకానికి శ్రేయస్సును సైతం చేకూర్చగలరు...."

"ఊహాగానమే కదూ! కొనసాగనివ్వు" అన్నాడు రామన్న.

"ఊహాగానంలోనుంచి ఇప్పుడు మనం అత్యంత వాస్తవిక ఘట్టంలోనికి ప్రవేశించబోతున్నాం. వరుసగా ఈ రెండు పత్రికల తాలూకు సంచికల్ని చదువగా చదువగా నా తల దిమ్మెక్కిపోయింది. మెదడు చైతన్యం లేని బంక మట్టిముద్దలా తయారైంది. భజావోఢంకా, గణగణగంటలలో చేతిలోవున్న పత్రికేదో తెలియరానంతగా బుద్ధి స్తబ్దమై పోయింది. ఈ స్తబ్ధతలో కళ్ళు మూసుకుని అలాగే వాలుకుర్చీలో పడుకున్నాను. బుర్రలో హఠాత్తుగా ఓ మెరుపులాంటి ఊహ మెరిసింది. ఈ రెండు పత్రికలు ఒక్కలాగే ఉన్నాయన్న ఊహ నాకు అకారణంగా కలిగింది కాదు. రెండింటిలోనూ ఒకటే రకమైన పలుకుబళ్ళు, ఒకటే విధమైన నానుడులు. ఒకటే విధమైన వాక్య విన్యాసాలు తరచుగా కనిపిస్తున్నాయి. ఎలా సంభవమైందిది? చెప్పనా రామం! పట్టణంలో రెండు పత్రికలున్నాయి కదూ! రెండింటికీ రచనలు సరఫరా చేస్తున్న రచయిత లిద్దరు కాదు - ఒక్కడు!...."

రామన్న నోరు తెరిచేశాడు.

"మనిషైతే తన రూపానికి వెయ్యి బురఖాలు తగిలించుకోవచ్చు. కుడిచేతిలో ఒక కలం, ఎడమచేతిలో ఒక కలం పట్టుకొని దస్తూరిలో కూడా మార్పు సాధించవచ్చు.

కానీ శైలిలో అలాంటి తిరకాసులు చెల్లవు. ఆ ఎత్తుగడలు, ఆ విరుపులు, ఆ నుడికారాలు రచయితను దాచిపెట్టవు. అంటే మనం వట్టి తియరీ పైనే ఇంతదూరం సాగివచ్చామన్నమాట! ఇకపై ముఖాముఖిగా వ్యక్తినే కలుసుకోబోతున్నాం..."

రామన్న తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు - "ఎలా తెలిసింది నీకు? ఎక్కడుంటాడతను?"

సీనప్ప పెదవులపైన సన్నగా ఓ దరహాసం మెరిసింది. -

"వినేవాడికి చెప్పేవాడు లోకువరా రామం! ఈ రహస్యాన్వేషణలో నేనెన్ని రాత్రులు మేలుకున్నానో, ఎన్ని ఎన్ని చోట్ల పొంచి పొంచి మాటు వేశానో నీకేం తెలుసు?" భుజంక్రింద చేయివేసి మిత్రుణ్ణి పైకి లేవదీశాడు సీనప్ప. చీకటిలో ఇద్దరూ రైల్వేకట్ట వెంబడి నడవసాగారు - "ఇలాగే ఒక ఫర్లాంగు దూరం నడిస్తే మనకు కొన్ని మట్టిమిద్దెలు కనిపిస్తాయి. ఈవలా, ఆవలా వీధులుంటాయి. మధ్యలో మట్టి మిద్దెలు, ఇంటికి ముంగిలి ఏదో, పెరడేదో తెలుసుకోడానికి వీల్లేకుండా ఉండడం మట్టి మిద్దెల ప్రత్యేక లక్షణం. ఇప్పుడు మనం ప్రవేశించబోతున్న ఇల్లుగూడా ఇందుకు మినహాయింపు కాదు. కానైతే ఇదివరకూ ఒక గుమ్మంలోనుంచీ అప్పలు, ఇంకొక గుమ్మంలోనుంచీ అన్నలు ప్రవేశించేవారు. మొదటిసారిగా మర్యాదాతిక్రమణం మనమూలంగానే జరగబోతున్నది...."

## 4

లోకానికింకా గంట తొమ్మిది కాలేదు. లబ్బీపేట కప్పుడే అర్ధరాత్రి కావచ్చినట్టుంది. మట్టివీధులు నిర్మానుష్యంగా పడివున్నాయి. వీధి దీపాలు గ్రుడ్డిగా కునికిపాట్లు పడుతున్నాయి. నిరంతర సంచలనానికి ఆలవాలమైన నగరంలో లబ్బీపేట - తరంగ సంక్షుభితమైన కడలి నడుమ ఓ చిన్ని ఏకాంత ద్వీపంలా ఉంది.

ఆ నీరవ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఓ చప్పుడు. తలుపు తట్టిన చప్పుడు.

మెల్లగా తలుపు తెరచుకుంది. ద్వారంగుండా వెలుపలికి ప్రసరిస్తున్న కాంతి ఆగంతకుల ఆకారాలను విస్పష్టంగా ప్రదర్శించేపాటి కాంతివంతంగా లేదు.

క్రొత్తముఖాలు కనిపించగానే అవతలి వ్యక్తి ఒక క్షణం పాటు స్తంభీభూతుడై పోయాడు.

"ఎవరండీ! ఎవరికోసం?" మాటలో తొట్రుపాటు ద్యోతకం కాకపోలేదు.

సీనప్ప బదులు చెప్పాడు - "క్షమించాలి. తలుపుతట్టి పిలవడం భావ్యం కాదేమో! తప్పనిసరిగా ఇలా చేయవలసి వచ్చింది..."

"సూటిగా విషయమేమిటో చెబితే సరిపోదూ?"

"చల్లకు వచ్చి ముంతదాచుకునేవాళ్ళం కాము కానీ మరీ అంత క్లుప్తీకరణ పనికిరాదు. గుమ్మంలో నిల్చుని ఎంతసేపని మాట్లాడుకోగలం! అనుమతిస్తే లోపలికి వచ్చి కూర్చుని, మీ అమూల్యమైన కాలంలో ఓ అరగంటసేపు వాడుకోవాలన్న సదుద్దేశం కూడా ఉంది మాకు...."

లాంఛనంగా అనుమతికోసం అర్థించడమే కానీ, అందుకోసం విధిగా వేచివుండాలన్న పట్టింపులేవీ పెట్టుకున్నట్టు లేదు సీనప్ప. ప్రక్కబలంగా మిత్రుడు వెన్నంటగా అతడు ద్వారాన్ని దాటి నడవలో ప్రవేశించాడు. అక్కడినుంచి హాల్లోకే వచ్చేశాడు -

"అబ్బాయిలూ! మీ వాలకాలేమీ బాగుండడం లేదు...." వెనుకవైపు నుంచి కటువుగా హెచ్చరిక వినిపించింది - "నేనిక్కడ ఒంటరిగా ఉన్నాననుకుంటే మీరు తీవ్రంగా

పొరబడ్డారన్నమాటే! గొంతెత్తి పిలిస్తే, మరుక్షణంలో ఇక్కడ ఇరవైమంది హాజరు కాగలరు..."

"ఫోను సదుపాయముంటే మీరు హాయిగా పోలీసుల్నే పిలిపించుకోవచ్చు. మాకేం ఇబ్బంది లేదు" – సౌకర్యంగా పేము కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ నింపాదిగా అన్నాడు సీనప్ప.

అవతలి వ్యక్తి మళ్ళీ రిచ్చపాటుకులోనుగాక తప్పిందికాదు.

ఆ అవకాశం మిత్రులకు చక్కగా ఉపకరించింది.

హాలుతాలూకు ద్వారబంధానికి ఆనుకుని నిశితంగా తమవైపు చూస్తూ నిల్చున్న వ్యక్తి వయస్సు ముప్పైకి దరిదాపుల్లో ఉంటుంది. కంకాళ మాత్రమైన శరీరం అతనిది! పైకి తేలిన నుదురు. అగాధాల్లాంటి కళ్ళు. పిరమిడ్‌లాంటి ముక్కు సంస్కారాన్ని చవిచూడని శిరోజాలు, ఆ ఆకృతికి ఒక విపరీతమైన వైచిత్రిని సమకూరుస్తున్నాయి. ఆ ఆకారం సదయాడుతున్న ఆవరణంగూడా అందుకు తగ్గట్టుగానే అమరింది. గాలికీ, వెలుతురుకు దుర్భేద్యంగా, భూగర్భ గృహానికి ఒక మంచి నమూనాలాగా వున్న ఆ కట్టడంలో దోమలు విశృంఖలంగా రొద చేస్తున్నాయి. నల్లులు నిర్భయంగా గోడలపైన సంచరిస్తున్నాయి. గాలి కదలకపోవడం ఒకటి, ఉన్నగాలిలో కూడా చెమ్మపాలు ఎక్కువకావడం ఒకటి – ఈ రెండు అవలక్షణాలూ ఆ ఇంటి నొక ఇల్లుగా కాక, అప్పుడే ఖాళీచేసిన చన్నీటి తొట్టిగా రూపిస్తున్నాయి –

సొరంగంలాంటి ఆ ఇంట్లో జీవితం గడుపుతున్న విచిత్ర వ్యక్తి ఉన్నట్టుండి ఓ నిర్ణయానికి వచ్చినట్టుగా ఒక్క వినురుతోవచ్చి కుర్చీలో కూలబడ్డాడు. "మాట్లాడాలంటున్నారు. దేన్ని గురించి?" అంటూ సూటిగా ప్రశ్నించాడు.

"అలాగన్నారు గనుక చాలా బాగుంది. చర్చనీయాంశం వ్యక్తిగత విషయాలను గురించి కాదు. ప్రస్తుతం ప్రజల్ని ఆకర్షిస్తున్న ప్రప్రథమ విషయం ఏదైతేవుందో, దాన్ని గురించి మాట్లాడుకోవాలని మా ఉద్దేశం...."

"అదేమిటని మీ అభిప్రాయం?"

"రాజకీయాలు కాదంటారా?"

"కావచ్చు....."

"విపులీకరించాలంటే – కులంతో ముడిపడివున్న రాజకీయాల మూలంగా సమాజంలో చెలరేగుతున్న సంక్షోభాన్ని గురించి – అవి చెప్పుకోవచ్చు. దాన్ని గురించి మనం మనసు విప్పి మాట్లాడుకోవాలి".

ఒక్కసారిగా ఎదురు తిరిగాడతను. "మనసువిప్పి మాట్లాడుకోడానికి ఒకర్ని ఒకరు బాగా ఎరిగివుండడం ముఖ్యం...."

"అదెంతపని! చిటికెలో పరిచయాలు ముగించుకోవచ్చు. రాజకీయాలకు సంబంధించినంత వరకూ మేము వట్టి ఖాళీ పేపర్లవంటి వాళ్ళం. అంటే నిరపాయకరమైన మనుషులం. పోగా మిమ్మల్ని గురించి మీ నోటంట మీరు చెప్పి తీరాలని కూడా మేము అడగటం లేదు. ఎందుకంటే మిమ్మల్ని గురించి మాకు బాగా తెలిసినట్టే లెక్క!"

పేము కుర్చీలోనుంచీ తేలు కుట్టినట్టుగా ఎదుటివ్యక్తి ఎగిరిపడ్డాడు.

"ఏం తెలుసు మీకు? ఏమిటి మీకు తెలిసింది?"

ఆ మాటలు కారడవిలో దారితప్పినవాడి ఆక్రందనలా ధ్వనించాయి.

"నిన్న మొన్నటివరకు మిమ్మల్ని గురించి కొద్దిమందికి మాత్రమే తెలుసు. స్వప్రయోజనం దృష్ట్యా వాళ్ళు మీ ఉనికిని, వ్యక్తిత్వాన్ని అదొక గొప్ప రహస్యంగా పదిలపరిచి ఉంచారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. అయినా చేయిదాటి పోలేదు. మమ్మల్ని ఇద్దరినీ మీరు మీ శ్రేయోభిలాషులుగానే భావించవచ్చు..."

అతడి ముఖం వివర్ణం కావడానికి క్షణంలో సగంసేపు పట్టలేదు. ప్రశ్న కూడా నూతిలోనుంచీ వెలువడిన శబ్దంలా నీరసంగా ఉంది –

"ఎలా తెలిసింది మీకు?"

"తెలుసుకున్న దానితో పోల్చి చూస్తే అందుకోసం మేము పడిన శ్రమ ఏమంత చెప్పుకోదగ్గది కాదు...."

ఇక్కడ రామన్న ప్రసంగంలో స్వయంగా కలుగ జేసుకున్నాడు–

"మేమే న్యాయాన్యాయ నిర్ణేతలం కాము. మాకున్న ధర్మా దర్మ విచక్షణాజ్ఞానం కూడా కొద్దిపాటిది. అయిదేళ్ళ పసివాడు దేవుడెలా ఉంటాడు నాన్నా అని తండ్రిని ప్రశ్నిస్తాడు. అలాంటి కుతూహలం తప్పితే మాకు మరొక దురుద్దేశం లేదు. మీరేం చేశారనైతే మాకు తెలుసు. ఎందుకు చేశారో తెలియదు. మేము కారణం తెలుసుకోగలిగితే చాలు...."

విచిత్ర వ్యక్తి తటాలున లేచి నిల్చున్నాడు.

"పారిపోవడం సాధ్యమేననుకుంటే మీరు తీవ్రంగా పొరబడ్డారన్నమాట!" ఈసారి హెచ్చరించే వంతు తనదైనట్టుగా అన్నాడు సీనప్ప.

కానీ పారిపోనుంకిస్తున్న సూచనలు అతడిలో కనిపించలేదు. మెల్లగా నడచివెళ్ళి అతడు వీధి తలుపు మూసి, లోపలినుంచీ గడియపెట్టాడు. తిరిగివస్తూ హాల్లోకి తెరచుకుంటున్న తలుపుల్ని కూడా మూసేశాడు. నెమ్మదిగా కుర్చీలో కూర్చున్నాడు.

"చూడండి ఫ్రెండ్స్!" మరింత నెమ్మదిగా ప్రారంభించాడతను. "వెక్కిరించడానికి అలవాటుపడినవాడు చిక్కిబిక్కరించక తప్పదని నాకు తెలుసు. ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి పరిస్థితి నన్నెదుర్కొని తీరుతుందన్న అనుమానం ఆంతర్యంలో నా అంతరాత్మకు ఉండనే ఉంది. మీరు ఉన్నపాళంగా లోపలికి వచ్చి తుపాకీ సంధించి "హాండ్స్ అప్" అంటున్నారు. ఎట్టి మినహాయింపులూ లేకుండా మీకు నేను లొంగిపోతున్నాను....."

ఒక క్షణం నిశ్శబ్దం.

"ఇదివరకు నేను లేచినిల్చునేసరికి నేను పారిపోదలస్తున్నానని మీరు సందేహించారు. మీరలా సందేహించడం సబబు కాదని నేను చెప్పను. కానీ నాబోటి వాడు లోకంలోకి పారిపోవడం సాధ్యం కాదు. ఎందుకంటే నేను లోకంనుంచి పారిపోయి వచ్చినవాణ్ణి –

"ఎందుకూ?"

"బ్రతకలేక!"

"మీకున్న తెలివితేటలతో మీరు లోకంలో బ్రతకలేకపోయారంటే నమ్మడం కష్టం....."

"వట్టి తెలివితేటలే కావు..." అతడు చరాలున బల్లలోనుంచీ ఓ సొరుగును యీవలికి లాగాడు. ఓ కవరు బయటికి తీశాడు. అందులో ఉండలా ముడుచుకుని పడివున్న ఓ కాగితాన్ని పైకి తీశాడు – "ఇది విశ్వవిద్యాలయం వారు నాకు ప్రసాదించిన

యోగ్యతాపత్రం. ఇదెలా నలిగిపోయిందో మీరు చూస్తున్నారు. కానీ దీనితో ముడిపడి ఉన్న నా జీవితం ఎన్ని నలుగుళ్ళపాలైందో, ఎన్ని రంపపు కోతలకు లోనైందో మీకు తెలియదు. బ్రతకడానికి కావలసిన తెలివితేటలూ, విద్యావివేకాలూనని మీ అభిప్రాయం...."

"అవి కాకపోతే మరేమిటంటారు మీరు?"

"చెప్పమంటారా ఫ్రెండ్స్!" చువ్వలా లేచినిల్చున్నాడతను – "కావలసింది కులం. నేను అన్నను కాను, అప్పనుకాను. ఆ యోగ్యతే నాకుంటే చదువు, తెలివితేటల్లాంటి మిగిలిన అర్హతలన్నీ నాకనవసరమై ఉండేవి. జిల్లాలో ఓ మారుమూల కుగ్రామం మాది. మా నాన్నగారికిప్పుడు కళ్ళు కనిపించవు. కళ్ళు కనిపించిన రోజుల్లో ఆయన భూమందుల మళ్ళను కౌలుకు సాగుచేసేవాడు. నాకు ముగ్గురు తమ్ముళ్ళు. ముగ్గురు చిన్నాన్నలు, వాళ్ళకు పన్నెండుగురు బిడ్డలు. ఆ ఇరవై ముప్పై మంది అక్కడ ఎండవానల కోర్చి, ఎముకలు విరచుకుంటే, ఇప్పుడు మీ ఎదుట నిల్చున్న ఈ అభాగ్యుడు కాలేజీలో చదువుకోగలిగాడు. మావాడు కలెక్టరవుతాడు, జడిజీ అవుతాడన్న వాళ్ళ అజ్ఞానానికి ఈ లోకం బ్రహ్మరథం పట్టదన్న సత్యం వాళ్ళకు చాలా ఆలస్యంగా తెలిసింది. నేను కూర్చోని పరీక్ష లేదు. తిరగని ఊరులేదు. చూడని ఆఫీసరు లేదు. దర్శించుకోని కార్యాలయం లేదు. ఉద్యోగం దొరకని వేసట ఒకవైపు, దుర్భరమైన దారిద్ర్య పరిస్థితులు మరోవైపు. అయిదారేళ్ళు అలాగే గడచిపోయాయి. ఎక్కడికి వెళ్ళినా చుక్కే ఎదురవుతూ వచ్చింది. చివరికీవూరొచ్చాను. గబ్బిలంలా ఈ వేషం ధరించాను. గబ్బిలానికి వెలుగంటే భయంకదూ! అవును, నాకూ వెలుగన్నా భయమే! అందుకే ఈ గుహలో జంతువులా జీవించాను. గ్రుడ్లగూబలా చీకటికి అలవాటు పడ్డాను. తోడేలులా కసి తీర్చుకున్నాను. నా అంతట నేనుగా సృష్టించుకున్న ఈ వృత్తిలో ఆర్జన పుష్కలమైన కొద్దీ శాంతి నిప్పచ్చరంగావచ్చునని మాత్రం నేను కలగనలేదు. ఆ వాస్తవం తెలిసి వచ్చేసరికి నేను నేనుగా లేను. మరమ్మత్తులకు అతీతమైన స్థితిలో ఉన్నాను. కాలసర్పం కాటువేసి నలుడు బాహుకుడుగా మారితే అందుకు శనేశ్వరుడే కారకుడని చెబుతుంది కథ. మరి నా ఈ వికృతాకారానికీ విపరీత వ్యక్తిత్వానికీ కారకులెవరో చెప్పవలసింది మీరు....."

రెండు వారాలు గడచిపోయిన తరువాత ఓరోజు తెల్లవారేసరికి కామవరం రామన్నగానీ, చీనేపల్లి సీనప్పగానీ రామదుర్గంలో కనిపించడంలేదన్న వార్త ఒకటి గాలిలా వ్యాపించింది. రాత్రి రెండు జాములప్పుడు రామదుర్గం నుంచీ బయలుదేరే రైలుబండిలో వాళ్ళెక్కుతుండగా చూచిన వాళ్ళొకరిద్దరు లేకపోలేదు. కానీ వారితోబాటుగా రైలెక్కిన మూడోవ్యక్తి ఎవడైఉంటాడన్నది మాత్రం ఒక చిదంబర రహస్యంగానే మిగిలి పోయింది!

• *1964* •